Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi


సంపుటి :04 సంచిక : 138 పేజీలు 8 వెల : 5 బుధవారం 26 నవంబర్ 2025






## స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు





# ఎపిలో కొత్తగా మరో మూడు జిల్లాలు

**మార్కాపురం, మదనపల్లె, పోలవరం ఏర్పాటు**

**కేబినేట్ సబ్ కమిటీ ప్రతిపాదనలకు సిఎం అంగీకారం**

అమరావతి: ఎపిలో కొత్తగా మూడు జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా ఈ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజన్లు, మండలాల మార్పు చేర్పులపై సచివాలయంలో కీలక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా మూడు జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముందు నుంచి చెబుతున్నట్టుగా మార్కాపురం, మదనపల్లి జిల్లాల ఏర్పాటుకు మంత్రివర్గం ఓకే చెప్పింది. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు అంగీకరించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సమీక్ష నిర్వహించిన అనంతరం మార్పులు చేర్పులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయించారు. కర్నూలు జిల్లా పెద్ద హరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా.. ఆదోని మండలాన్ని విభజించి

కొత్త మండలం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఓకే చెప్పారు. ఇక కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

**ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటురాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ అమరావతి: లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి మొదలు పెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ-లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు సూచించారు.**




## భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి

ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం

ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి

అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ




## 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

ఉగాదిలోగా మరో అయిదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం

మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి




## మలక్కా ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతం

మరో వాయుగుండం ఏర్పడే అవకాశం

రెండు అల్పపీడనాలతో భారీ వర్షాలకు ఛాన్స్

## మన నాగరికత భారతదేశానికి పునాది

**మన మూలాల్లోకి తిరిగి కనెక్ట్ అవుదాం**

**అయోధ్య ధ్వజ్ ఆరోహణపై పవన్**

అమరావతి: మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి



అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

## ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి హామీ

**మంత్రి నారా లోకేశ్‌తో గుడిసె ఆదికృష్ణమ్మ భేటీ**




కర్నూలు: ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి గుడిసె ఆదికృష్ణమ్మ తెలిపారు. మంగళగిరిలో నారా లోకేష్ ను కలిసి ఆదోనిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించామని ఆమె విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోని జిల్లాగా ఏర్పాటుకు పునరాలోచన చేయలన్నారు. జిల్లాగా ఏర్పడే అన్ని అర్హతలు ఆదోని కి ఉందన్నారు. చాలా సంవత్సరాల నుండి ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను గౌరవించాలని కోరామన్నారు. 44 గ్రామాలు కలిగి ఒకే మండలంగా ఉందని ఆదోనిని 3 మండలాలుగా విభజన చేయాలని కోరామన్నారు. పరిపాలన సులభతరం కావడానికి, ప్రజలకు సేవలు త్వరగా అందడానికి ఆదోని ప్రాంతాన్ని 3 మండలాలుగా విభజించాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి కొరకు రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరామన్నారు. యువతకు ఉపాధి ఉద్యోగాలు కల్పనకు పరిశ్రమలు నెలకొల్పాలని ఆదోని పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు, స్టార్టప్ సపోర్ట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు స్థాపించాలని కోరామన్నారు.

ఆరోగ్యం , విద్యా రంగాల బలోపేతం ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునికీకరించడం, కొత్త కోర్సులు అందుబాటులో ఉండేలా కాలేజీలు ఏర్పరచాలని మంత్రి లోకేష్ కు అభ్యర్థించామన్నారు.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు,




37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

# జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ

హైదరాబాద్: జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్నా 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను డిప్యూటి సిఎం,మంత్రి శ్రీధర్‌బాబు,జూపల్లి కృష్ణారావులు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో హైదరాబాద్ పరిధి మరింత పెరుగుతందన్నారు. అంతేకాకుండా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలుకు కేబినేట్ ఆమోదించింది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానించాలన ఇనిర్ణయించారు. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో




10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు
ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం
కేబినేట్ ఆమోదించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపునకు ఆమోదించారు. అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు.

# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య





అయోధ్య: భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిం చారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంధాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ
నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

# ఎన్నికల కోసమే ఇందిరమ్మ చీరలు

సిద్దిపేట: కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండగకి 18 ఏళ్లు నిండిన 1.30కోట్ల మంది మహిళలకు చీరలు అందిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో ఉన్న 46లక్షల మందికే చీరలు ఇస్తున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే ఇదంతా చేస్తున్నారని అన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.83లక్షల మంది మహిళలుంటే 1.99లక్షల మందికే చీరలు ఇచ్చారని చెప్పారు. జిల్లా కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పండగ.. పండగకి సంక్షేమ పథకాలు ఇస్తే రేవంత్‌రెడ్డి ఓట్ల ఓట్లకు సంక్షేమ పథకాలు ఇస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు.ఒక్క ఏడాదికి మాత్రమే చీర ఇచ్చి సారె పెట్టానని రేవంత్‌రెడ్డి అంటున్నారు. చీర ఇచ్చాను సర్పంచ్ ఎన్నికల్లో మహిళలంతా ఓట్లు వేయండని చెబుతున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500 సంగతి ఏమైంది? రెండు చీరలు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చిన మీకు మహిళలు ఎందుకు ఓటేయ్యాలి? పట్టణ ప్రాంతాల్లో ఎన్నికలు లేవు కాబట్టి చీరలు లేవు.. వడ్డీలేని రుణాలు లేవు. మహిళా సంఘాలు రూ.25వేల కోట్ల రుణాలు తీసుకుంటే రూ.5వేల కోట్లకు మాత్రమే వడ్డీలేని రుణం వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగనామం పెడుతోంది. మొత్తం డబ్బులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. గతంలో స్త్రీనిధి
కింద వడ్డీలేని రుణాలు ఇచ్చాం. ఇప్పుడు ఇవ్వట్లేదు. ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని మహిళా సంఘాలకు ఒక్క ఆర్టీసీ బస్సు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని నేటికి రెండేళ్లు అయినా ఒక్క మెగావాట్ పవర్ కూడా పెట్టలేదన్నారు.

# నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): సిఎం రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు. విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు. దాదాపు 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నారని కేటీఆర్ తెలిపారు. దాదాపు ఆ భూములన్నింటికీ రేవంత్ సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. లక్షన్నర గజం విలువ చేసే భూమికి 10 వేలు కడితే చాలని పాలసీ తెచ్చారని తెలిపారు. పారిశ్రామిక వాడల భూములను అమ్మి 4-5లక్షల కోట్ల కుంభకోణం చేయాలని చూస్తున్నాడని అన్నారు. అంబానీ, అదానీలను ఒకే దెబ్బకు క్రాస్ చేయాలని రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మనుమలు, మునిమలు కూర్చొని తిన్నా కూడా అరిగిపోని ఆస్తిని వెనకేసుకోవాలని ఈ స్కామ్‌కు తెరతీశాడని చెప్పారు.
50-60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని తెలిపారు. మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీలు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అందుకే మేం గ్రిడ్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. గతంలో 50 శాతం ఐటీ ఆఫీసులకు, 50 శాతం ఇతర అవసరాల కోసం ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టినంకనే అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ధారాదత్తం చేస్తోందని అన్నారు. భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై కౌన్సిల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నిలదీశారని కేటీఆర్ గుర్తుచేశారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు కోర్టు ఆపింది.. మిగతావి ఎవరు ఆపారని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లిలందరికీ న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ముస్లింలకు 4 వేల కోట్లు బ్జడెట్‌లో పెడతామని.. పెట్టలేదని మండిపడ్డారు. తెలంగాణపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని కేటీఆర్ అన్నారు. తెచ్చిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థి రణభేరీ మోగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాయకులు సమాజం నుంచి వస్తారు.. నాయకుల చుట్టూ తిరిగితే నాయకులు కారని వ్యాఖ్యానించారు.

## 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

అమరావతి: 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళ్లు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు.గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు.

# మలక్కా ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతం

విశాఖపట్నం: బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంపై మరోసారి వరణుడు తన ప్రతాపం చూపనున్నాడు. ఈనెలాఖరున రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాగల 6 గంటల్లో ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తదుపరి 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఉపరితల ఆవర్తన ప్రభావంతో కొమొరిన్, నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసర ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఇప్పటికే కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పింది. రాబోయే 24 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు... పలు చోట్ల భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో రైతులకు కూడా వాతావరణ అధికారులు కీలక సూచనలు చేశారు. మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ
అధికారులు హెచ్చరించారు. అయితే తుఫాన్ తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళు తుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.
కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనడపతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

**ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు ప్రారంభం**

హైదరాబాద్: డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివిధ విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్లో వరుసగా ఈ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు వరుసగా జరిగే అన్ని సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయా విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. బుధవారం మౌలిక వసతులు, అభివృద్ధిపై సీఎంతో పాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొంటారు. నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమంపై సాయంత్రం 4 గంటలకు సీఎంతో పాటు మంత్రులు వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు టూరిజం, టెంపుల్ టూరిజంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. నవంబర్ 29 వ్యవసాయం, సంక్షేమ విభాగాలతో సాయంత్రం 4 గంటలకు: మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులుతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్ పాల్గొంటారు. నవంబర్ 30న ఆరోగ్య రంగంపై సీఎంతో పాటు మంత్రి దామోదర్ రాజనరసింహ సంబంధిత అధికారులు పాల్గొంటారు.

## రాయలసీమలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

అమరావతి: ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ది కలిగేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టింది.

# రైతు సంక్షేమం కోసం రైతన్న మీకోసం

**ఉత్తేజిత న్యూస్ సి.బెళగల్ నవంబర్ 25**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి కార్యక్రమంలో రైతన్నా మీకోసం అనే కార్యక్రమాన్ని అన్నదాతలకు ప్రతి ఇంటింటికి చేరాలని ఉద్దేశంతో వ్యవసాయ రంగంలో రైతులకు అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలను రైతులకు, ప్రజలకు చేరవేయాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజుని చేసేందుకు కొన్ని విప్లవాత్మక కార్యాచరణ విధానాలను రైతులకు అందజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో ఈరోజు నుంచి రైతన్నా మీ కోసం ప్రారంభమవుతున్నట్లు తెలియజేశారు. కావున ప్రతి రైతు తప్పనిసరిగా ఈ సర్వేలో పాల్గొని రైతుకు సంబంధించినటువంటి అన్ని పథకాలను సద్వినియోగపరచుకోవాలని తెలియజేశారు.ముఖ్యంగా రాష్ట్రంలో ప్రతి ఎకరాకు త్రాగు నీరు,సాగునీరు అందించే దిశగా అడుగులు వేస్తూ, నీటి భద్రత విషయంలో ప్రతి రైతు సూక్ష్మ రూపంలో,స్ప్రింక్లర్లు,డ్రిప్పుల ద్వారా పంటలు పండిస్తూ తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని పెంపొందించే దిశగా సాగాలని తెలుపుతూ,అదేవిధంగా అన్నదాతలు సాగు చేసే పద్ధతులలో ఎక్కువగా డిమాండ్ పై ఆధారపడే పంటలను పండించినట్లయితే రైతు ముందుకు వెళ్తారని తెలియజేశారు. అదేవిధంగా ప్రస్తుతంలో రైతు సాగు చేస్తున్న విధానానికి సాంకేతికత తోడైనప్పుడు నిర్ణీత సమయంలో ఎక్కువ టెక్నాలజీని ఉపయోగించి,నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి,రైతులు ఉత్పాదకత పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలుపుతూ, అదేవిధంగా ప్రభుత్వము వ్యవసాయ రైతులకు వ్యక్తిగత పనిముట్ల యంత్రాల సరఫరా చేస్తుంది.అదేవిధంగా కిసాన్ డ్రోన్ సేవలు కూడా అందిస్తుంది.రైతుల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలని దీని కోసం ప్రభుత్వం రైతులకు తెలియజేస్తూ,ఈ విధంగా ప్రభుత్వం నుంచి మద్దతు ధర పత్తి కొనుగోలు కేంద్రాలను మరియు రైతులకు పెట్టుబడి సహాయం కింద అన్నదాత సుఖీభవ నిధులను రెండు విడుతలుగా అందించిందని,ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందిస్తుంది అని తెలియజేస్తూ,ప్రభుత్వం సంక్షోభం నుంచి సంక్షేమ దిశగా సూపర్ సిక్స్ హామీల్లో రైతులకు ప్రతి హామీని అమల్లోకి తీర్చేందుకు కృషి చేస్తుందని తెలియజేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ వంటి పథకాలు సంక్షేమ పథకాలు కార్యక్రమాలు అమలు చేస్తుందని రైతులకు తెలియజేశారు.కావున రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సి.బెళగల్ మండలం కన్వీనర్ చంద్రశేఖర్,సింగిల్ విండో చైర్మన్ చిన్న తిమ్మప్ప, టిడిపి నాయకులు పాల్గొని ప్రతి ఇంటికి ఈ యొక్క రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవ కేంద్ర ఇన్చార్జిలు పాల్గొనడం జరిగినది.

# పంచమీ తీర్థం నాడు 1.50 లక్షల మందికి అన్నప్రసాదాలు, అల్పాహారం

**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్25**



తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి పంచమితీర్థ మహోత్సవం సందర్భంగా టిటిడి అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 1.50 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు, అల్పాహారం అందించారు. టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు, ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశాల మేరకు టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం పర్యవేక్షణలో అన్నప్రసాదం విభాగం అధికారులు ప్రతి భక్తుడికి అన్నప్రసాదాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం 160 కౌంటర్లలో తోళ్లప్ప గార్డెన్స్‌లో 50, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద 40, శ్రీ అయ్యప్పస్వామివారి ఆలయం వద్ద 50, పూడి వద్ద 20 అన్నప్రసాదం కౌంటర్లలో 24వ తేదీ రాత్రి నుండి 25వ తేదీ ఉదయం, మధ్యాహ్నం వరకు కదంబం, చక్కెర పొంగలి, దద్దోజనం, పులిహోర, ఉదయం ఉప్మా, పొంగలిని విరివిగా అందజేశారు. పంచమి తీర్థం కోసం శ్రీ పద్మావతీ అన్నప్రసాద కేంద్రం, శ్రీనివాసం కాంప్లెక్స్, టిటిడి పరిపాలనా భవనంలోని ఎంప్లాయిస్ క్యాంటిన్ ల నుండి 13 బాయిలర్స్ ద్వారా వంటలను తయారు చేసి హోల్డింగ్ పాయింట్లు, గ్యాలరీలు, క్యూలైన్లు, భక్తులు అధికంగా ఉండే కూడళ్ల వద్ద పంపిణీ చేశారు. వంటలలో నాణ్యత, రుచి, శుచి మరింత మెరుగ్గా ఉండేందుకు జీడిపప్పు, నెయ్యిని అదనంగా ఉపయోగించారు.

**1.25 లక్షల మందికి బాదంపాలు**

పంచమి తీర్థం సందర్భంగా అన్నప్రసాదాలతో పాటు 1.25 లక్షల మందికి బాదంపాలు, లక్ష మందికి బిస్కెట్ ప్యాకెట్లు, 30వేల మందికి మజ్జిగ, 30 వేల మందికి సుండలను అందించారు. భక్తులకు సకాలంలో అన్నప్రసాదాలను అందించేందుకు 900 మంది శ్రీవారి సేవకులు, 100 ఎన్. ఎస్. ఎస్. విద్యార్థులు, 200 మంది అన్నప్రసాదం సిబ్బంది, 500 మంది ఎఫ్.ఎం.ఎస్ సిబ్బంది సేవలు అందించారు.

**దాదాపు 1.50 లక్షల తాగునీటి బాటిళ్ల పంపిణీ**

పంచమితీర్థం సందర్భంగా విచ్చేసిన లక్షలాది మంది భక్తులకు టిటిడి ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో దాదాపు 1.50 లక్షల తాగునీటి బాటిళ్లు పంపిణీ చేశారు. ఆలయం, పుష్కరిణి పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచారు. భక్తుల సౌకర్యార్థం 300 శాశ్వత, తాత్కాలిక, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో రోజుకు 300 మంది, పంచమితీర్థం రోజున 600 మంది పారిశుద్ధ్య సిబ్బంది సేవలందించారు. టిటిడి ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి పంచమీ తీర్థం

**శ్రీవారి కానుక కమలముల హారం, వజ్రాల అడ్డిగ**

**కనులవిందుగా సిరులతల్లికి స్నపనతిరుమంజనం**

**పద్మపుష్కరిణిలో పవిత్రస్నానంతో భక్తుల తన్మయత్వం**

**అసంఖ్యాకంగా పాల్గొన్న భక్తులు**

**అధికారులు, సిబ్బంది, పోలీసులు, శ్రీవారి సేవకుల సేవలను అభినందించిన టీటీడీ ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్25.**



శ్రీ పద్మావతి అమ్మవారు అవతరించిన పంచమి తిథిని పురస్కరించుకుని కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం పంచమీ తీర్థం (చక్రస్నానం) అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో అసంఖ్యాకంగా పవిత్రస్నానం ఆచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, లక్షలాది మంది భక్తుల సమూహంలో అమ్మవారి పంచమీతీర్థ మహోత్సవం వైభవోపేతంగా జరిగిందన్నారు. వేలాదిమంది భక్తులు పుణ్య స్థానాలు ఆచరిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడిలోని అన్ని విభాగాలు పటిష్టమైన ఏర్పాట్లు చేసి, విజయవంతంగా జరిగాయన్నారు. అన్ని విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది, పోలీసులు, శ్రీవారి సేవకులు, పారిశుద్ధ్య కార్మికులు విశేషంగా కృషి చేశారని వారిని అభినందించారు. భక్తులందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు కలగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

అంతకుముందు ఉదయం శ్రీ పద్మావతి అమ్మవారు పల్లకీలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. అనంతరం అమ్మవారికి ఆస్థానం నిర్వహించి ఉత్సవర్లను ఊరేగింపుగా పంచమీతీర్థ మండపానికి వేంచేపు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద తెల్లవారుజామున 4.30 గంటలకు బయలుదేరిన సారె ఉదయం 11 గంటలకు తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అర్చకులు పంచమి తీర్థ మండపంలో సారెను అమ్మవారికి సమర్పించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

**అమ్మవారికి శ్రీవారి కానుక**

శ్రీ పద్మావతి అమ్మవారి పంచమీ తీర్థం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారు కానుకలు పంపారు. రూ.1.31 కోట్లు విలువైన 1.14 కిలోల బరువు గల బంగారు కమలముల హారం, వజ్రాల అడ్డిగ నగ, సారెతో పాటు తిరుపతి పురవీధులలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు.

**శోభాయమానంగా సిరులతల్లికి స్నపనతిరుమంజనం**

పంచమీ తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు ఉదయం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన కుంకుమపువ్వు, పైనాపిల్, డ్రై ఫ్రూట్స్, రెడ్ మరియు ఎల్లో రోజాపెటల్స్, వట్టివేరు, తులసిమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. పంచమి తీర్థం సందర్భంగా పంచమి మండపం వద్ద ఒక టన్ను పుష్పాలతో ఏర్పాటు చేసిన మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో తామర పూలు, రోజాలు, లిల్లీలు తదితర సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్ తో గార్డెన్ సిబ్బంది అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం 12.10 నుండి 12.20 గంటల మధ్య పంచమి తీర్థం(చక్రస్నానం) ఘట్టం ఘనంగా జరిగింది. చక్రత్తాళ్వార్‌తో పాటు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తజనం పద్మ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు బంగారు తిరుచ్చి వాహనంలో అమ్మవారి ఉత్సవర్లను ఊరేగించనున్నారు. అనంతరం రాత్రి 10 నుండి 11 గంటల వరకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరుగనుంది.

ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, చంద్రగిరి ఎంఎల్ఏ శ్రీ పులివర్తి నాని, పలువురు బోర్డు సభ్యులు శ్రీ ఎన్. సదాశివరావు, శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, శ్రీ నరేష్ కుమార్, శ్రీ ఎం.శాంతారామ్, శ్రీమతి జానకి దేవి, శ్రీమతి అనుగోలు రంగశ్రీ, ఎక్స్ అఫిషియో మెంబర్ శ్రీ సి.దివాకర్ రెడ్డి,
జెఈవో శ్రీ వి.వీరబ్రహ్మం, సివిఎస్‌వో శ్రీ కే.వి. మురళీకృష్ణ, ఎస్పీ శ్రీ ఎల్ . సుబ్బరాయుడు, సిఈ శ్రీ సత్యనారాయణ, ఎఫ్ ఏ అండ్ సీఏవో శ్రీ ఓ బాలాజీ, డెప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**నవంబరు 26న పుష్పయాగం**

నవంబరు 26వ తేదీ బుధవారం ఆలయంలో పుష్పయాగం సాయంత్రం 5 నుండి 8 గంటల వరకు వైభవంగా జరుగనుంది.

# ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి.

**ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య.**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్25**



ప్రజల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ దరఖాస్తుల పరిష్కారం, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో మంగళవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ ద్వారా ప్రజలకు అవకాశం కల్పించిందని తెలిపారు. దీంతో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరంలో రోడ్లను, ఫుట్ పాత్ లు ఆక్రమించడం జరగకుండా నిత్య పర్యవేక్షణ చేయాలని తెలిపారు. భవన నిర్మాణాలు ప్లాన్ ప్రకారం కాకుండా డీవేయేషన్ చేసి నిర్మాణాలు చేపడుతున్న వాటిని ప్రాథమిక దశలోనే అడ్డుకోవాలని తెలిపారు. అలాగే అనధికారిక ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకుండా చూడాలని అన్నారు. పెండింగ్ ఉన్న ప్రకటనల పన్నులు వసూలు చేయాలని అన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఏసీపీ లు మూర్తి, మధు, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, మేనేజర్ హాసిమ్, టి.పి.ఎస్. వంశి, టిపిబివో లు, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసం కూటమి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు నవంబర్ 25 మంగళవారం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా గోనెగండ్ల మండలం తిప్పనూరులో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు.

# కోడుమూరు మండల అభివృద్ధి కొరకై నిధులు కేటాయించాలి పి.ఎస్ రాధాకృష్ణ


**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



కోడుమూరు మంగళవారం 25 మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు గాజులదిన్నె ప్రాజెక్టు మరియు ఎల్ ఎల్ సి కెనాల్ ద్వారా సాగు త్రాగునీరు అందించాలని అలాగే మండల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కే రాజు సారధ్యంలో జీపు జాత ప్రారంభించడం జరిగింది . ఈ జీపు జాతను పాలకుర్తి గ్రామంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ గారు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్ పార్లమెంటు అత్యధికంగా వెనుకబడి ఉంది ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల కలిసి ఉన్నప్పుడు ఒక రకంగా ఉండేది ఇప్పుడు నంద్యాల జిల్లా విడిపోయిన తర్వాత కర్నూల్ పార్లమెంటు ఎడారిగా మారిపోయింది పక్కనే తుంగభద్ర ఇటుపక్క హంద్రీ నది ఉండి కూడా సాగునీరు పక్కన పెడితే కనీసం తాగునీరైనా సరే దొరికే పరిస్థితి చాలా దారుణంగా ఉంది చాలా గ్రామాలు ఇప్పటికీ త్రాగునీటి కొరకు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి గత ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వం కర్నూల్ పార్లమెంటును అభివృద్ధి చేస్తామని ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చారు ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు నత్తనడకన నడుస్తుంది సంపూర్ణమైనటువంటి నిధులు లేక ఆ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది తుంగభద్ర నదిపై బ్రిటిష్ కాలంలో నిర్మించినటువంటి ఆర్డీఎస్ ఆనకట్టద్వారా గత 60 సంవత్సరాల నుండి తెలంగాణ ప్రభుత్వం పుష్కలంగా నీళ్లు వాడుకుంటుంది కానీ మన కర్నూలు జిల్లా దరిద్రం ఆర్డీఎస్ కుడికాల నుండి నీళ్లు వాడుకోవడానికి అనుమతులు ఉన్న ఆ కుడికాలువను పూర్తి చేయడంలో ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి అలాగే కర్నూల్ జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్నటువంటి కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదు . స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలుగా వస్తున్న కనీసం మండల కేంద్రమైన కోడుమూరులో శాశ్వతత్రాగునీటి పరిష్కారం చేయడంలో విఫలం అయిపోయారు మన పాలకులు పక్కన హంద్రీ నది నెత్తిన గాజులదిన్నె ప్రాజెక్టు ఇటు తుంగభద్ర ఉన్న కోడుమూరు ప్రాంతానికి సాగు త్రాగునీరు రావడం లేదు కోడుమూరు నియోజకవర్గం ఎస్సీ నియోజకవర్గం రాజ్యాంగం ప్రకారం ఎస్సీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి అలాంటిది నియోజకవర్గం గురించి ఏ ప్రభుత్వాలు కూడా అభివృద్ధి చేయడం లేదు కోడుమూరులో విద్యార్థులు డిగ్రీ చదవాలి అంటే ప్రైవేటు విద్యాసంస్థలను ఆశ్రయించాల్సి ఉంది ఎంతోకాలంగా డిగ్రీ కళాశాల కళాశాల కావాలని అడుగుతున్న పట్టించుకోవడం లేదు కోడుమూరు ప్రాంతంలో పరిశ్రమలకు అనుకూలమైన భూములు వనరులు ఉన్నాయి మనలను పాలించే పాలకులకు చిత్తశుద్ధి లేక అన్యాయం జరుగుతుంది గ్రామీణ ప్రాంతాల విషయానికొస్తే డ్రైనేజీలు సిసి రోడ్లు లేక చాలా గ్రామాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి ఎర్రదొడ్డి గ్రామంలో విశాలమైనటువంటి చెరువు ఉన్నది ఆ చెరువును 10 అడుగుల లోతు మట్టి తీసీ ఎల్ ఎల్ సి ద్వారా నీళ్లు నింపితే భూగర్భ జలాలు పెరిగి చుట్టుపక్కల ఉన్నటువంటి గోరంట్ల చిల్లబండ ఎర్రదొడ్డి ప్రాంతాల పొలాలకు మంచి సౌకర్యంగా ఉంటుంది కృష్ణాపురం దగ్గర ఉమ్మడి రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ కొరకు భూమిని సేకరించారు కానీ రాష్ట్రం విడిపోయాక ఆ భూమి గురించి గానీ అక్కడ రావాల్సిన పరిశ్రమ గురించి గానీ పాలకులు పట్టించుకోవడం లేదు ఆ భూమిలో అలాగే గోరంట్ల గ్రామంలో హంద్రీ నదిపై నిర్మాణంలో ఆగిపోయిన బ్రిడ్జిని పూర్తిచేస్తే క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల నుండి కోడుమూరు మీదుగా ఆదోని మంత్రాలయం రాయచూరు లాంటి ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది ఆ బ్రిడ్జి నిర్మాణంలో ఆగిపోవడం వల్ల వర్షాకాలంలో హంద్రీ నదికి నీళ్లు వదిలితే అవతలి గట్టుకు వెళ్లలేరు గోరంట్ల గ్రామానికి చెందిన చాలామంది రైతులకు అవతలి వైపు పొలాలు ఉన్నాయి వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది ఇలా గ్రామాల వారీగా ఎన్నో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి ఈ సమస్యల పరిష్కారం కొరకు దాదాపు 33 డిమాండ్స్ తో ఈ జీపు జాత ప్రజల ముందుకు వెళ్లడం జరిగింది ఈ జాత పాలకుర్తిలో ప్రారంభమై అమడగుంట్ల చిల్లబండ అనుగొండ లద్దగిరి గోరంట్ల వెంకటగిరి మీదుగా కోడుమూరు కృష్ణాపురం వర్కూరు కల్లపరిమీదుగ పులకుర్తిలో ముగించడం అయినది గ్రామాలలో ఉన్న సమస్యలన్నిటిని తీసుకొని డిసెంబర్ ఒకటో తేదీన తాసిల్దార్ కార్యాలయం నందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని వారన్నారు ఈ కార్యక్రమంలో గఫూర్ మియా జీపీ వీరన్న కే లక్ష్మన్న కుమారస్వామి కొత్తూరు శ్రీనివాసులు మల్లికార్జున గిడ్డయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు నవంబర్ 25 మంగళవారం మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పనితీరు పట్ల రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, అధికారులు, రైతులు, మహిళలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

## కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు నవంబర్ 25 మంగళవారం భూమి,భుక్తి, విముక్తి పోరులో అమరులైన వారి వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమస్త ప్రజానీకం ఉద్యమించాలని లిసిపిఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.గనిరాజు పిలుపు నిచ్చారు .నవంబర్ 24 సోమవారం సాయంత్రం సమయాన భూమి, భుక్తి ,విముక్తి పోరులో ప్రాణాలర్పించిన అమరవీరుల వర్ధంతి సభను పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో గ్రామ చావిడి వద్ద జరిగింది. ఈ సభకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న అధ్యక్షత వహించారు.

ఈ సభకు ముఖ్య వక్తగా హాజరైన గనిరాజు మాట్లాడుతూ తెలంగాణ, నక్సల్ బరి, శ్రీకాకుళ, గోదావరిలోయ ప్రతిఘటనా పోరాటాలలో వేలమంది తమ జీవితాలను తృణప్రాయంగా అర్పించారని అన్నారు. భారత విప్లవోద్యమంలో కామ్రేడ్స్ నీలం రామచంద్రయ్య,చంద్ర పుల్లారెడ్డి, చారు మజుందార్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, అలాగే కర్నూలు జిల్లా పార్టీ నాయకులు కామ్రేడ్ తిక్కన్న,గోకారి, ఉరుకుందప్ప,రామన్నగౌడ్ వంటి మహనీయులు అమరులయ్యారని వారి ఆశయాల సాధనకై మనమంతా సమసమాజ స్థాపనకై ఉద్యమించాలని అన్నారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద బడా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి,నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చి కట్టు బానిసలుగా కార్మికులను మారుస్తుందని దుయ్యబట్టారు. భారతీయ జిడిపిలో 70 లక్షల కోట్లు విలువ చేసే వ్యవసాయరంగాన్ని ఆధాని,అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే బూటకపు వ్యవసాయ ప్రణాళికను తీసుకువచ్చిందని,ఇది రైతాంగానికి తీవ్రనష్టకరమని,ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ఆదివాసీ ప్రాంతంలో లక్షలకోట్లు విలువచేసే సహజవనరులను ,ఖనిజ సంపదను కొల్లగొట్టడానికే ఆపరేషన్ కగార్ ను తీసుకువచ్చి మావోయిస్టులను,అమాయక ఆదివాసీలను బూటకపు ఎన్కౌంటర్లతో హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు అనంతరం లిసీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం మోదీ అడుగుజాడల్లోనే నడుస్తూ కార్పొరేట్ కంపెనీల భజన చేస్తుందని విమర్శించారు.అధికారం చేపట్టిన 18నెలల కాలంలో 16లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ,ఈ నెల విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో మరో 13 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చాయని,మరో 16 లక్షల పైగా యువతకు ఉద్యోగాలు రాబోతున్నాయని ,అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని అన్నారు.కార్పొరేట్ కంపెనీలకు ఎకరా 99 పైసలకు లీజుకు ఇచ్చి ,వేల కోట్లు రాయితీలు ఇస్తుందని,ఈజ్ ఆఫ్ డూయింగ్ బిసినెస్ పేరుతో అనుమతులు ఇస్తున్నదని,వ్యవసాయ భూములను నాశనం చేస్తున్నదని అన్నారు.సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈ సభకు ముందుగా పార్టీ జెండాను కే.నాగరాజు ఎగరవేశారు. ముందుగా అమరవీరులందరికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభలో పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి రఫీ, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎస్. బాలరాజు ,కే .చెన్నకేశవులు, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు కే సోమశేఖర్ ,సీపీయుఎస్ ఐ పార్టీ జిల్లా నాయకులు పి.రమేష్, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు ఎస్ బాబు, బి రామలింగం ,వి. నరసింహులు ,ఎం .మల్లికార్జున్ ,ఎస్ రాజు తదితరులు మాట్లాడారు.

## ఎర్రబాడు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని పరిశీలించిన జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు నవంబర్ 25 మంగళవారం నియోజకవర్గ గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలోన ప్రభుత్వ స్థలంలోన ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని నిలబెట్టాలని స్థలాన్ని సేకరించడంతో నేడు జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలు నిలబెట్టడానికి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాలు అందరు కూడా సహకరించాలి. ఎర్రబాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని నిలబెట్టి అంటరానితనం పోగొడతామని మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ గోనేగండ్ల మండల అధ్యక్షులు ప్రసన్నకుమార్ జై భీమ్ఆర్పిఎస్ గోనేగండ్ల మండల కన్వీనర్ సోమన్న జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ నాయకులు జాను ఎర్రబాడు గ్రామస్తులు హనుమన్న తదితరులు ఎర్రబడ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమాచారం ఇవ్వకుండా సచివాలయాన్ని ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శి పై ఎంపీడీవోకు స్థల దాత ఫిర్యాదు

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



మండల కేంద్రమైన తుగ్గలి లో సమాచారం ఇవ్వకుండా నూతన సచివాలయాన్ని ప్రారంభించిన తుగ్గలి గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పై నూతన గ్రామ సచివాలయ భవనం స్థల దాత డాక్టర్ సీతారామ శర్మ కుమారుడు రవి శర్మ మంగళవారం ఎంపీడీవో విశ్వమోహనకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా సచివాలయ భవనం స్థల దాత డాక్టర్ సీతారామ శర్మ కుమారుడు రవి శర్మ మాట్లాడుతూ సర్వే నంబర్ 760 నందు తమ గ్రామానికి మంజూరైన సచివాలయ భవనం నిర్మాణ కోసం స్థలం కావలెను అని ప్రభుత్వ అధికారులు అడుగగా వెంటనే లక్షల విలువ చేసే 25 సెట్ల స్థలాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. అయితే తమ స్థలం నందు నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవం చేసే కార్యక్రమానికి గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మమ్ములను ఆహ్వానించలేదని, ప్రోటోకాల్ లో భాగంగా భూమి దానం చేసిన యజమానులకు కూడా ఆహ్వానం అందించాలని ఎంపీడీవోకు ఆయన ఫిర్యాదు చేశారు.అందువల్ల పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పై చర్యలు తీసుకోకపోతే తమ స్థలాన్ని తాము స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ప్రభుత్వానికి కూడా తాము ఇంతవరకు రాతపూర్వకంగా స్థలాన్ని రాసి ఇవ్వలేదని తెలిపారు.అవసరమైతే ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి,ఈ విషయంపై కోర్టుకు వెళ్లి సంబంధిత అధికారులకు నోటీసులు అందజేస్తామని ఆయన తెలియజేశారు.

# మాది రైతు ప్రభుత్వం.

### రైతు పక్షపతిగా సీఎం నారా చంద్రబాబు పనిచేస్తున్నారు.

### రైతుల మేలుకోసమే రైతన్నా.. మీ కోసం

### నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**ఉత్తేజిత ప్రతినిధి. నందికొట్కూరు. నవంబర్ 25.**



మాది మంచి రైతు ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు పక్షపతిగా పాలన చేస్తున్నారు, రైతల మేలుకోసం రైతన్నా.. మీ కోసం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇంటి ఆవరణలో రైతన్నా.. మీకోసం అవగాహన సధస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ, మైకనేజేషన్ టెక్నాలజీ, ప్రకృతి వ్యసాయం, ఆధునిక టెక్నాలజీ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడి సాయం రైతులకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మా ఉమ్మడి ప్రభుత్వం అని, ఉమ్మడి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. 'రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని ఈ నెల నవంబర్ 24 నుండి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలనే లక్ష్యంతో ఉమ్మడి ప్రభుత్వం పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తోందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు, ఈ పంచ సూత్రాల ద్వారా వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి, అన్నదాతలకు అన్నివిధాలా అండగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నందికొ ట్కూరు మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ నాగేశ్వరావు, రైతులు చంద్రుడు, శివ, కరీం, సత్యం రెడ్డి, సురేష్ రెడ్డి, పాల్గొన్నారు.

## నేడు మదిలేటి స్వామి లో బహిరంగ వేళాలు

### - ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



: బేతంచెర్ల మండలం పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోవెలసిన మద్దిలేటి స్వామి ఆలయంలోనేడు బుధవారం బహిరంగ వేళాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆలయ ఉప కమిషనర్ మాట్లాడుతూ..
ఆలయంలోఉదయం 10 గంటలకు దేవస్థానం పరిసరాలలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కులైసెన్స్, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు లైసెన్స్ మరియు1,3 షాపులు లీజు ఇచ్చుటకు బహిరంగ వేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.రాబోవు ముక్కోటి ఏకాదశి ఉత్సవములకు వివిధ రకాల సంబంధించిన పనులకు సీల్డ్ టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.కాబట్టి ఎవరైనా టెండర్ లలో పాల్గొనవచ్చునని ఆయన తెలియజేశారు.

## లాడెన్ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం..!

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి నవంబర్ 25-:**



మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూర్ గ్రామంలో మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు లాడెన్ ఆధ్వర్యంలో రైతన్న.. మీకోసం కార్యక్రమం ఇంటింటికి తిరిగి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల్లో రైతును రాజును చేసేందుకు, నీటి భద్రత , డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ప్రభుత్వం నుంచి మద్దతు వంటి ఈ ఐదు విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. "రైతన్న మీకోసం" కార్యక్రమం యొక్క ఉద్దేశ్యాలు వివరిస్తూ పాడి రైతులకు అండ, పెట్టుబడులు, పరిశ్రమలు మరియు సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా రైతులకి లాభం చేకూర్చాలని రైతుల కోసం పంచ సూత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అన్ని గ్రామాలలో సంబంధిత రైతు సేవ కేంద్రం సిబ్బంది ద్వారా వివరించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీ రెడ్డి చైతన్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..



## బాలికల హాస్టల్ నిర్మాణ పనులను ఆకస్మిక తనిఖీ

:ఏపీ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జి. నాగముని

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ నవంబర్ 25 :**

నందికొట్కూరు నియోజవర్గం నందికొట్కూరులో కొత్తగా నిర్మిస్తున్న బాలికల హాస్టల్ నిర్మాణ పనులను ఏపీ రాష్ట్ర విద్యా సంక్షేమ మాలిక వసతుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జి. నాగముని తస్మికంగా తనిఖీ చేశారు. వారు కాంట్రాక్టర్ వివరాలు కోరగా ఈ నిర్మాణానికి 2 కోట్ల20 లక్షల రూపాయలతో ఈ నిర్మాణం జరుగుతుందని వారు డైరెక్టర్ నాగముని కీ వివరించారు. మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జి. నాగముని మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు విద్యార్థులకు చదువుతోపాటు వారి సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట వేశారని అని అన్నారు. హాస్టల్ నిర్మాణ పనులు మీరు ఒప్పుకున్న కాంట్రాక్ట్ ప్రకారం మంచి నాణ్యమైన కడ్డీలు సిమెంటు, కంకర, పిల్లర్లను క్యూరింగ్ చేయడం వంటి పనులను నాణ్యమైన గా ఉండాలని, మీరు కాంట్రాక్టు లో ఉన్న అగ్రిమెంట్ పనులు చేయకుండా, నాసిరకమైన సిమెంటు, కడ్డీలు వాడినట్లు తమ దృష్టికి వస్తే, తక్షణమే పై అధికారులకు తెలియజేసి మీ కాంట్రాక్ట ను రద్దు చేస్తామని వారు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని అక్కడ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు.

## నందికొట్కూరులో సీజ్ అయిన వాహనాలు వేలం...!

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి నవంబర్ 25 -**



**- నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ సిఐ .ఎస్. ఆర్ నాయక్**

**- పాత్రికేయులతో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు**

: కర్నూల్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్ సూచనల మేరకు నంద్యాల జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10:00 గంటలకు నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ అయిన వాహనాలు (07) వాటిని బహిరంగ వేలం వేస్తున్నట్లు నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ సీఐ ఎస్ .రామాంజనేయులు నాయక్ నాయక్ మంగళవారం తెలిపారు . స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే ఔత్సాహికులు ప్రభుత్వ నిబంధనల మేరకు ధరావతు చెల్లించి
వేలం పాటలో పాల్గొనాలని నంద్యాల జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఢాకాకు హసీనా అప్పగింత

### భారత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

ఢాకా: తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత' అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది.

# సింగర్ జుబీన్ గార్గ్‌ది ముమ్మాటికీ హత్యే

గౌహతి: ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ మరణంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని.. అతడిని హత్య చేశారంటూ అసెంబ్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా ఆయన మీడియా ముందు ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ సారి శాసన సభ వేదికగా జుబీన్ మరణంపై సీఎం హిమంత ఈ సంచలన కామెంట్స్ చేయడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం అస్సాం అసెంబ్లీలో గార్గ్ మరణం గురించి చర్చించడానికి ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ సందర్భంగా సీఎం హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ.. జుబీన్ గార్గ్ ది ప్రమాదం కాదని, ఆయన్ను చంపేశారని ఆరోపించారు. మరోవైపు గార్గ్ మరణంపై దర్యాప్తు చేస్తున్న ఏకసభ్య కమిషన్ వాంగ్మూలాలు నమోదు చేయడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి గడువును డిసెంబర్ 12 వరకు పొడిగించింది. గౌహతి హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సౌమిత్ర సైకియా నేతృత్వంలోని కమిషన్ నవంబర్ 3 నుంచి విచారణను ప్రారంభించింది. దీనికి సంబంధించిన నివేదికను సమర్పించే గడువు నవంబర్ 21తో ముగిసింది.

ఉత్తేజిత దినపత్రిక



# రూ.6 లక్షలలోపే కొత్త కారు..



మీరు నూతన సంవత్సరంలో బడ్జెట్ ధరలో మంచి కారు కొనుగోలు చేయాలను భావిస్తున్నారా? అయితే, మీకో మంచి ఆఫర్ అందుబాటులో ఉంది. కేవలం రూ.6 లక్ష లోపే కొత్త కారు కొనుగోలు చేయచ్చు. కంపెనీ ఇయర్ ఎండ్ ఆఫర్ కింద రూ.65 వేల వరకు డిస్కౌంట్ అందిస్తోంది. మరెందుకు ఆలస్యం ఇప్పుడే బుక్ చేసుకోండి..

మరి కొన్ని రోజుల్లో 2024 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో కస్టమర్లను ఆకర్శించేందుకు కార్ల తయారీ కంపెనీలు ఇయర్ ఎండ్ ఆఫర్లు తీసుకొస్తున్నాయి. తమ వాహనాలపై భారీ తగ్గింపు ఇస్తూ స్టాక్‌ను ఖాళీ చేస్తున్నాయి. దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ సైతం కొన్ని మోడళ్లపై డిస్కౌంట్ ఆఫర్లు అందిస్తోంది. కంపెనీ తన హ్యాచ్‌బ్యాక్ మోడల్ ఇగ్నిస్‌పై భారీగా డిస్కౌంట్ ఇస్తోంది. కస్టమర్లు ఈ ఆఫర్‌ను ఎక్స్ఛేంజ్ బోనస్, క్యాష్ డిస్కౌంట్, కార్పొరేట్ డిస్కౌంట్ రూపంలో పొందవచ్చు. నూతన ఏడాదికి బడ్జెట్ ధరలో కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఇది మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు.

మారుతీ ఇగ్నిస్ కారుపై రూ.65,000 వరకు తగ్గింపు లభిస్తోంది. అందులో రూ.40,000 వరకు క్యాష్ డిస్కౌంట్ ఉండగా.. రూ.15,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.10,000 వరకు కార్పొరేట్ బోనస్ లభిస్తుంది. ఈ ప్రయోజనాలు డిసెంబర్ 31, 2023 వరకు చెల్లుబాటులో ఉంటాయి. అయితే డీలర్‌షిప్ ప్రాంతం, కారు రంగు, వేరియంట్, స్టాక్ లభ్యత, ఇతర అంశాలను బట్టి ఆఫర్లు మారే అవకాశం ఉంటుంది. మీ సమీప అధీకృత మారుతి సుజుకీ డీలర్‌షిప్‌ను సంప్రదించి ఆఫర్ వివరాలు తెలుసుకోవడం మంచిది. ఇగ్నిస్ దాని ఇంజిన్ గరిష్ఠంగా 83 %శక్తినీ, 113 గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేయగలదు. ఈ కారులో 5- స్పీడ్ మ్యాన్యువల్, 5-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఉంది. ఇగ్నిస్ ప్రీమియం, అప్‌డేట్ చేసిన ఇంటీరియర్‌ను కలిగివుంది. ఈ కారులో ఐదుగురు సులభంగా కూర్చోవచ్చు. స్మార్ట్ ప్లే స్టూడియో ఫీచర్‌తో కూడిన 7-అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంది. కాల్స్, మ్యూజిక్, నావిగేషన్ వంటి సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్ కూడా కారులో ఉంది. ఈ కారులో కంపెనీ నెక్సా సేఫ్టీ షీల్డ్‌ను అందించింది. ఇగ్నిస్‌కు డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్‌లు, తో కూడిన , వెనుక డోర్ చైల్డ్ లాక్, వెనుక పార్కింగ్ కెమెరా, చైల్డ్ సీట్ లాక్ యాంకర్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి.

రూ.5.84 లక్షలే..

మారుతీ సుజుకీ తన నెక్సా ప్రీమియం డీలర్‌షిప్ ద్వారా ఇగ్నిస్‌ను విక్రయిస్తోంది. దీని ధర రూ. 5.84 లక్షలు (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతోంది. ఆపైన రూ.65 వేల వరకు డిస్కౌంట్ పొందే అవకాశం ఉంది. ఈ కారు టాప్ మోడల్ రూ.8.16 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది. భారతీయ మార్కెట్లో ఇది టాటా టియాగో, హ్యుందాయ్ ఐ10, టాటా పంచ్‌లకు పోటీగా ఉందని చెప్పవచ్చు.

# రైల్వే నుంచి రూ.1374 కోట్ల ఆర్డర్..




రైల్వే శాఖ నుంచి రూ.1,374 కోట్ల భారీ ఆర్డర్ అందుకున్న క్రమంలో ఓ ఇంజినీరంగ్ కంపెనీ స్టాక్ దూసుకెళ్తోంది. గురువారం ట్రేడింగ్‌లో 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇవాళ సైతం జోష్‌లో కొనసాగుతోంది. గత 2 ఏళ్ల కాలంలో చూస్తే ఏకంగా 511 శాతం లాభాలు అందించింది. ఆ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకోండి మరి. ఇంజినీరింగ్ సెక్టార్‌కు చెందిన మల్టీ బ్యాగర్ స్టాక్ టెక్సా మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ అదరగొడుతోంది. ఈ కంపెనీ డిసెంబర్ 20న రైల్వే శాఖ నుంచి రూ. 1,347 కోట్లు భారీ ఆర్డర్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఆ కంపెనీ షేర్లు దూసుకెళ్తున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో 5 శాతానికిపైగా పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇవాళ శుక్రవారం డిసెంబర్ 22 రోజు ట్రేడింగ్ లోనూ మంచి జోష్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం రూ. 172.85 వద్ద కొనసాగుతోంది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందిస్తున్న ఈ స్టాక్ గురించి తెలుసుకుందాం. 2023, డిసెంబర్ 20 నాటి కంపెనీ బీఎస్ఈ ఫైలింగ్ ప్రకారం.. రైల్వే బోర్డు 3400 %దీూశచీూ% వ్యాగన్‌ల తయారీ సరఫరా కోసం కంపెనీకి ఆర్డర్ ఇచ్చింది. వీటిలో 1133 వ్యాగన్‌లలో మొదటి విడత 2024, డిసెంబర్ 31 నాటికి అందించాలి. రెండో విడతలో 2025, జూన్ 30 నాటికి 1133 వ్యాగన్‌లు అందించాలి. 2025, డిసెంబర్ 31 నాటికి 3వ విడత 1134 వ్యాగన్‌లు అందించాలి. . ఈ ఆర్డర్ విలువ సుమారు రూ. 1374.41 కోట్లు అని కంపెనీ తెలిపింది. 2023 సెప్టెంబర్ తో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 70 శాతం వృద్ధి చెంది రూ. 20 కోట్లుగా నమోదు చేసింది.

కంపెనీ ఆదాయం 64 శాతం పెరిగి రూ. 805 కోట్లకు పెరిగింది. 2023 సెప్టెంబర్ తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 70 శాతం వృద్ధి చెంది రూ. 20 కోట్లకు చేరుకుంది. కంపెనీ ఏకీకృత మొత్తం ఆదాయం 64 శాతం పెరిగి రూ. 805 కోట్లకు పెరిగింది. సెగ్మెంట్ నుంచి దాని స్థూల ఆదాయం 3 రెట్లు పెరిగి రూ. 616 కోట్లకు చేరుకుంది. ఇది క్రితం సంవత్సరం రూ. 192 కోట్లుగా ఉంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 188.95 గా ఉంది. 52 వారాల కనిష్ట ధర రూ. 40.49 గా ఉంది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,574.25 కోట్లుగా ఉంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు చూసుకంటే ఈ కంపెనీ షేర్లు 196 శాతం లాభపడ్డాయి. గత ఒక సంవత్సరంలో 209 శాతం పెరిగాయి. గత రెండు సంవత్సరాలలో 511 శాతం లాభపడ్డాయి. గత మూడు సంవత్సరాలలో 550 శాతం పెరిగింది. రెండేళ్ల క్రితం ఇందులో రూ.1 లక్ష పెట్టి షేర్లు కొనుగోలు చేసినట్లయితే ఇప్పుడు వాటి విలువ రూ.6 లక్షల పైన ఉంటుంది. అదే మూడేళ్ల క్రితం కొనుగోలు చేసినట్లయితే ఇప్పుడు రూ.6.50 లక్షల పైన విలువ ఉంటుంది.

# తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర..

క్రిస్మస్ వేళ కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించినట్లు ప్రకటించాయి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ. తగ్గించిన కొత్త రేట్లు డిసెంబర్ 22 నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపాయి. క్రిస్మస్ వేడుకలకు ప్రజలు సిద్ధమవుతున్న క్రమంలో కేంద్ర సర్కార్ శుభవార్త చెప్పింది. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల సందర్భంగా నాలుగు మెట్రో నగరాల్లో19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం ప్రకటించా యి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై నగరాల్లో ఒక్కో సిలిండర్ పై రూ.39.50 తగ్గిస్తున్నట్లు వెల్లడించాయి. తగ్గించిన కొత్త రేట్లు ఈ రోజు అంటే 2023, డిసెంబర్ 22 నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపాయి. ధరలు తగ్గిన తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 1757.50కి దిగివచ్చింది. అయితే, 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ ధరలు తగ్గించినప్పటికీ డొమెస్టిక్ (గృహ వినియోగ సిలిండర్) ఎల్‌పీజీ సిలిండర్ ధరలను మాత్రం మార్చలేదు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు. ప్రస్తుతం గృహ వినియోగ సిలిండర్ ధరలు స్థిరంగానే కొనసాగుతు న్నాయి. సాధారణంగా కమర్షియల్, డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలకు సంబంధించి ప్రతి నెల మొదటి రోజున సమీక్షిస్తాయి చమురు సంస్థలు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఇలా ధరలను మారుస్తుంటాయి.

# అర్జెంట్‌గా మనీ కావాలా?

మీకు అత్యవసరంగా డబ్బులు అవసరమయ్యాయా? క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందా? అయినే నో టెన్షన్. మీరు మీ ఎల్ఐసీ పాలసీపై చాలా తక్కువ వడ్డీకే రుణం తీసుకోవచ్చు. మరి దీని అర్హతలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలి? అనే వివరాలు తెలుసుకుందాం. అనుకోని సంఘటన జరిగినట్లు అత్యవసరంగా పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమవుతాయి. అప్పుడు ఏం చేయాలో తోచదు. బ్యాంకులో రుణం తీసుకోవడం అంటే కాస్త సమయం తీసుకుంటుంది. వడ్డీ రేట్లు సైతం ఎక్కువగానే ఉంటాయి. క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్న వారికి బ్యాంకులు లోన్ ఇచ్చేందుకు ఇష్టపడవు. అలాంటి వారి కోసం ఓ మంచి అవకాశం ఉంది. చాలా తక్కువ వడ్డీకే, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నా లోన్ పొందే సులభమైన మార్గం. అదే ఎల్ఐసీ పాలసీ పై లోన్ తీసుకోవడం. మీ వద్ద ఎల్ఐసీ పాలసీ ఉంటే చాలా వేగంగా తక్కువ వడ్డీకే లోన్ పొందే అవకాశం ఉంది. ఆ వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం. భారతీయ జీవిత బీమా సంస్థలో పాలసీ కలిగిన వారు ఈజీగా లోన్ తీసుకొచ్చు. పాలసీ స్వాధీన విలువలో 90 శాతం వరకు రుణంగా ఇస్తుంది ఎల్ఐసీ. అయితే, ఎల్ఐసీ ఎండోమెంట్ పాలసీదారులకు మాత్రమే ఈ లోన్ పొందే అర్హత ఉంటుంది. ఆరు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తూ పాలసీ గడువు ముగిసే వరకు అసలు చెల్లించకుండా లోన్ కొనసాగించే వెసులుబాటు ఉంది. మెచ్యూరిటీ తర్వాత వచ్చే మొత్తం నుంచి ఎల్ఐసీ లోన్ మొత్తాన్ని మినహాయించుకుంటుంది. లేదా పాలసీదారుడు మరణిస్తే పరిహారం నుంచి ఆ మేరకు తగ్గించుకుంటుంది. ఒక వేళ వడ్డీ కూడా చెల్లించకుంటే, పాలసీని ముందే టెర్మినేట్ చేసే హక్కు ఎల్ఐసీకి ఉంటుందని గుర్తుంచుకోవాలి.

అర్హతలు ఇవే.. ఎల్ఐసీ నుంచి లోన్ తీసుకోవాలంటే పాలసీ తీసుకుని కనీసం 3 సంవత్సరాలు నిండి ఉండాలి. మీ ఇన్సూరెన్స్ పాలసీకి సరెండర్ వ్యాల్యూ ఉండాలి. పాలసీ బాండ్?ను ఎల్ఐసీకి ఇవ్వాలి. ఇంకా అర్హత ఉంటే అదే పాలసీపై




రెండో రుణం కూడా తీసుకునేందుకు వీలుంది. ఎల్ఐసీ కాకుండా ఇతర ఆర్థిక సంస్థల నుంచి సైతం మీ పాలసీపై లోన్ తీసుకోవచ్చు. కాకపోతే ఎల్ఐసీ సరెండర్ విలువపై 90 శాతం వరకు లోన్ ఇస్తే ఇతర సంస్థలు ఇంత కంటే తక్కువ మొత్తం ఇస్తాయి.ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎల్ఐసీ వెబ్సైట్లో ఆన్లైన్ సర్వీసెస్ సెక్షన్‌లో ఆన్లైన్ లోన్ ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత రిక్వెస్ట్ ఫర్ ద లోన్ ఆప్షన్ కనిపిస్తుంది. కొత్తగా రుణం తీసుకోవాలనుకునే వారి కోసం మరో ఆప్షన్ కూడా ఉంటుంది. పాలసీదారుడి బ్యాంకు ఖాతాలో లోన్ మొత్తం జమ అవుతుంది. అందుకే దీనికంటే ముందు ఎల్ఐసీకి ఇచ్చిన బ్యాంకు అకౌంట్ వివరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. మీ ఏజెంటు ద్వారా కూడా ఎల్ఐసీ పాలసీపై లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే నేరుగా ఎల్ఐసీ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి అప్లై చేసుకోవచ్చు. ఏ విధానంలో దరఖాస్తు చేసినా, రుణం మాత్రం మీ బ్యాంకు అకౌంట్?లోనే జమ చేస్తారు. మీరు లోన్ను బ్యాంకు ద్వారా చెల్లించవచ్చు. లేదా ఎల్ఐసీ కార్యాలయానికి నేరుగా వెళ్లి అయినా చెల్లించవచ్చు. అత్యవసర సమయాల్లో వేగంగా రుణం పొందొచ్చు. పర్సనల్ లోన్ కంటే వడ్డీ రేటు చాలా తక్కువ. క్రెడిట్ స్కోర్‌తో అవసరం లేదు. ఏ ఇతర అర్హత పత్రాలను ఇవ్వాల్సిన పనిలేదు. అలాగే పాలసీదారుడు అకాల మరణం చెందితే, పాలసీ బెనిఫిట్స్ను కుటుంబానికి అందజేస్తారు.

# యూనివర్సిటీలో కాల్పులకు తెగబడిన విద్యార్థి..

తండ్రితో గొడవపడి.. అతడ్ని కాల్చి చంపిన ఓ విద్యార్థి.. అటు నుంచి నేరుగా తాను చదువుకుంటోన్న యూనివర్సిటీకి వచ్చాడు. అతడు తొలుత ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతోనే అక్కడకు చేరుకుని.. చివరకు మరో దారుణానికి ఒడిగట్టాడు. తోటి విద్యార్థులపై విచక్షణారహి తంగా కాల్పులు జరిపాడు. అత్యంత ఘోరమైన ఈ ఘటన ఐరోపా దేశం చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రేగ్ నగరంలో చోటుచేసుకుంది. ఆ దేశ చరిత్రలోనే తొలిసారి ఇంతటి దారుణం జరగడం గమనార్హం. మధ్య ఐరోపా దేశం చెక్ రిపబ్లిక్‌లో గురువారం దారుణమైన ఘటన చోటుచేసుకుంది. రాజధాని ప్రేగ్ నగరంలోని చార్లెస్ యూనివర్సిటీలో ఓ విద్యార్థి కాల్పులకు తెగ బడ్డాడు. ఈ ఘటనలో కనీసం 15 మంది మృతి చెందగా... మరో 30 మంది వరకూ గాయప డ్డారు. కాల్పుల సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడ్ని హతమార్చారు. యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీలోని ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ వద్ద ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందిత విద్యార్థి తొలుత తన తండ్రిని చంపి ఆపై యూనివర్సిటీకి వచ్చి కాల్పులకు తెగబడ్డట్టు సమాచారం.

తండ్రి హత్యలో నిందితుడి కోసం పోలీసుల



గాలింపు చేపట్టిన తరుణంలోనే ప్రేగ్ నగరానికి చేరుకుని ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీస్ చీఫ్ మార్టిన్ వాంద్రసెక్ తెలిపారు. ఆత్మహత్య చేసుకోడానికి నిందితుడు ప్రేగ్‌కు వస్తున్నట్టు తెలుసుకుని.. అతడి కోసం ఛార్లెస్ యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగం భవంతిలో పోలీసులు గాలిస్తుండగా మరో భవనంలోకి వెళ్లాడు. కాగా, గతంలో రష్యాలో జరిగిన ఇటువంటి ఘటనను స్ఫూర్తిగా తీసుకుని నిందితుడు ఈ దారుణానికి పాల్పడ్డాడని పోలీసులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధిత కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. ఈ ఘటనపై ఇతర ఐరోపా దేశాధినేతలు విచారం వ్యక్తం చేశారు. 1993లో స్వతంత్ర దేశంగా చెక్ అవతరించిన తరువాత మొదటిసారి జరిగిన అత్యంత దారుణమైన కాల్పుల ఘటన ఇదే. దీంతో యావత్ దేశం షాక్‌లో కూరుకుపోయింది. చెక్ హోమ్ మంత్రి విట్ రక్సున్ మాట్లాడుతూ... ఘటనలో వేర్పాటువాద లేదా తీవ్రవాద కోణం లేదన్నారు. నిందితుడు తన స్వస్థలం హోస్టన్‌లో గురువారం ఉదయం తండ్రి చంపి.. రాజధానికి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో వచ్చాడని అన్నారు. తరువాత అతడి ఇంటిలో చేసిన తనిఖీల్లో ప్రేగ్‌లో డిసెంబరు 15న మరొక వ్యక్తి, అతడి 2 నెలల కుమార్తెను హత్య చేసినట్టు ఆధారాలు బయటపడ్డాయి. అయితే, విద్యార్థికి గతంలో ఎటువంటి క్రిమినల్ రికార్డు లేదని అధికారులు చెప్పారు. ముష్కరుడి ఒంటిపై తీవ్ర గాయాలున్నాయని, అయితే అతడు తనను తాను చంపుకున్నాడా లేదా పోలీసులు జరిపిన కాల్పుల్లో కాల్చి చంపబడ్డాడా అనేది స్పష్టంగా తెలియరా లేదని పేర్కొన్నారు. దుండుగుడి కాల్పుల నుంచి తప్పించుకోడానికి పలువురు విద్యార్థులు భవంతిపై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకు న్నారు. ఈ క్రమంలో వారికి గాయాలైనట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



# పూంఛ్ దాడికి ముందు ఉగ్రవాదుల రెక్కీ..

జమ్మూ కాశ్మీర్‌లో సైన్యంపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు అధికారులు చెబుతు న్నారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్న అధికారులకు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సైనికుల వాహనాలు వెళ్తాయని తెలిసి.. ఆ ప్రాంతంలో ముందు గానే ఉగ్రవాదులు రెక్కీ నిర్వహిం చినట్లు సైనిక ఉన్నతాధికారులు గుర్తించారు. నెల రోజుల వ్యవధిలోనే ముష్కరులు రెండుసార్లు దాడులకు దిగడం తీవ్ర కలకలం రేపుతోంది. జమ్మూ కాశ్మీర్‌లో సైనికులు వెళ్తున్న వాహనాలపై గురువారం ఉగ్రవాదులు కాల్పు లకు తెగబడిన ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు అమరులు అయ్యారు. గత నెల రోజుల వ్యవధిలోనే రెండోసారి ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం తీవ్ర సంచలనంగా మారింది. అయితే ఈ దాడికి పాల్పడేందుకు ముష్కరులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్న ట్లు తెలుస్తోంది. ముందుగా ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి.. ఆ తర్వాత మూల మలుపు వద్ద కొండల్లో దాక్కొని దాడులు చేసినట్లు భద్రతా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై ఇప్పటికే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం జమ్మూ కాశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో సైనికులను తరలిస్తున్న రెండు వాహనాలపై ఉగ్రవాదులు భీకర కాల్పులకు తెగబడ్డారు. అయితే అక్కడే కొండపై నుంచి ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. అయితే దాడికి ముందు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి నట్లు తెలుస్తోంది. పూంఛ్ జిల్లాలోని ధేరా కి గాలి, బుఫ్లియాజ్ మధ్య గల ధత్యార్ మోర్ వద్ద గురువారం మధ్యాహ్నం 3.45 గంటలకు సైనికులపై ఉగ్రవాదులు దాడి చేశారు. సైనిక వాహనాలపై బుల్లెట్ల వర్షం కురిపించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురు కాల్పులు జరపగా.. అప్పటికే వారు అక్కడి నుంచి పారిపోయినట్లు సైనిక ఉన్నతాధికారులు గుర్తించారు. అయితే ఉగ్రవాదులు చేసిన దాడిలో ఐదుగురు సైనికులు అమరులయ్యారు. అయితే ధేరా కి గాలి, బుఫ్లియాజ్ మార్గంలో ప్రమాదకరమైన మూలమలుపు ఒకటి ఉంది. దీంతో అక్కడే సైనిక వాహనాలపై దాడి చేయాలని ఉగ్రవాదులు నిర్ణయించుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే ఆ ప్రాంతంలో ఉన్న కొండల్లో ముందుగానే నక్కి ఉన్న ముష్కరులు.. ఆ ప్రమాదకరమైన మూల మలుపు వద్ద సైనిక వాహనాలు నెమ్మదిగా ప్రయాణించగానే కాల్పులకు దిగారు. వాహనాలు స్లోగా వెళ్తున్నప్పుడు సులువుగా దాడి చేయవచ్చని.. ముష్కరులు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడి కోసం ఉగ్రవాదులు ముందుగానే రెక్కీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ధేరా కి గాలి ప్రాంతంలో ఓ ఆపరేషన్ కోసం సైనికులను తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ముగ్గురు లేదా నలుగురు ఉగ్రవా దులు కొండల్లో నక్కి ఉండి కాల్పులకు పాల్పడినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాడి జరిగిన ప్రాంతంలో భద్రతా సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టి అనువణువూ గాలిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌లతో పాటు డ్రోన్లను ఉపయోగించి గాలింపు ఆపరేషన్ చేపట్టారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని మోహరించి ముష్కరులను పట్టుకుంటామని ఆర్మీ అధికారులు ప్రకటించారు.ఈ దాడికి బాధ్యత తమదే అని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ ఇప్పటికే ప్రకటించుకుంది. మరోవైపు.. సైనికులపై ఉగ్రవాదులు కాల్పులు చేయడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడం పెను సంచలనంగా మారింది. గత నెల రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదులు ఇలాగే గుహల్లో నక్కి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఆ ఘటనలో ఇద్దరు యువ కెప్టెన్లు, ముగ్గురు జవాన్లు అమరులయ్యారు.

# లారీ డ్రైవర్లకు ఉచితంగా టీ

శివరామచారి రాత్రి పూట హైవేలపై లారీలు వెళ్తూ ఉంటాయి. లారీ డ్రైవర్లు నిద్ర లేకుండా వందల కిలోమీటర్లు డ్రైవింగ్ చేస్తూనే ఉంటారు. ఈ క్రమంలోనే ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. దీంతో రాత్రి పూట రోడ్ యాక్సిడెంట్‌లను నివారించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లారీ డ్రైవర్లకు ఉచితంగా టీలు సరఫరా చేయాలని నిర్ణయించింది. వేడి వేడి టీ తాగడం వల్ల నిద్ర మత్తు వదిలి ప్రమాదాలు జరగ కుండా ఉంటాయని భావిస్తోంది. అతి వేగం, నిద్రమత్తు కారణంగానే రాత్రి పూట చాలా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. నిరంత రాయంగా లారీ డ్రైవర్లు వందల కిలోమీటర్లు ప్రయాణించడం వల్ల అలసటతో నిద్రమత్తు వచ్చి ప్రమాదాలకు కారణం అవుతూ ఉంటాయి. అయితే ఇలాంటి ప్రమాదాలు అర్ధరాత్రులు చోటు చేసుకోకుండా ఒడిశా ప్రభుత్వం కొత్త ప్రయత్నానికి తెర తీసింది.

రాత్రి పూట హైవేలపై ప్రయాణించే లారీ డ్రైవర్లకు నిద్రమత్తు వదిలేలా వేడి వేడి టీని ఉచితంగా అందించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే హైవేలపై ఉన్న దాబాల్లో లారీ డ్రైవర్లకు ఉచితంగా ఛాయ్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. హైవేల పక్కన ఉన్న దాబాలు, హోటళ్లలో లారీ డ్రైవర్లకు ఉచితంగా టీ అందించాలని ఒడిశా ప్రభుత్వం సూచించింది. ఈ కార్యక్రమం అమలులో భాగంగా ముందుగా రోజూ రాత్రి 3 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ఫ్రీ ఛాయ్ ఇవ్వనున్నట్లు చెప్పింది. అయితే ఈ పూర్తి ఖర్చును రాష్ట్ర



ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఒడిశా రవాణా శాఖ మంత్రి టుకుని సాహు గురువారం వెల్లడించారు. రహదారులపై తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది చనిపోతున్నారని.. ఈ పరిస్థితిని నియంత్రించాలని సీఎం నవీన్ పట్నాయక్ ఆదేశాలు జారీ చేశారని మంత్రి టుకుని సాహు చెప్పారు. హెల్మెట్‌లు లేకుండా బైక్‌లు నడపకూడదని ఇప్పటికే ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు వివరించారు.




మరోవైపు.. సరకు రవాణా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు రాత్రిళ్లు నిద్రలేమితో ఉంటారని.. అలాంటి వారికి హైవేలపై ఉండే దాబాలు, హోటళ్లలో ఫ్రీ టీ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

టీ తాగిన తర్వాత లారీ డ్రైవర్లు కొద్దిసేపు రెస్ట్ తీసుకునేలా హైవేల పక్కన కొన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఒడిశా ప్రభుత్వ అధికారులు తెలిపారు. దీంతోపాటు ఒడిశాలోని 30 జిల్లాల్లో లారీ టెర్మినల్స్ నిర్మిస్తున్నామని.. అందులో లారీ డ్రైవర్లకు అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. డ్రైవర్లు నిద్రపోవడానికి, స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.



# ఉదయం పూట ఈ గ్రీన్ స్మూతీ తాగితే..



మనం ఆరోగ్యంగా ఉండటానికి.. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ప్రశాంతమైన నిద్ర చాలా కీలకం. ముఖ్యంగా.. మన ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి పోషకాహారం ఎంతో అవసరం. ఈ క్రమంలో– ప్రత్యేకించి ఉదయాన్నే మనం తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉదయం పూట మన డైట్‌లో పోషకాహారంపై శ్రద్ధ వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. మీరు ఉదయం పూట ఈ హెల్తీ స్మూతీ తాగితే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. ఈ హెల్తీ స్మూతీ ఎలా తయారు చేసుకోవాలి, ఆరోగ్య ప్రయోజనాల గురించి ఈ స్టోరీలో చూద్దాం.

కావలసిన పదార్థాలు.. లెట్యూస్ ముక్కలు – అరకప్పు, పాలకూర – అరకప్పు, వాము ఆకులు – అరకప్పు, అవిసె గింజలు – 2 టీస్పూన్లు, సబ్జా గింజలు – 2 టీస్పూన్లు, అరటిపండు ముక్కలు – అరకప్పు, కొబ్బరి నీళ్లు – కప్పు, ఇలా తయారు చేసుకోండి..

ముందుగా గింజలన్నింటినీ కొబ్బరి నీళ్లలో 10 నిమిషాల పాటు నానబెట్టాలి. ఈ లోపు ఆకుకూరలన్నీ శుభ్రం చేసి పెట్టుకోవాలి. ఆ తర్వాత పైన పేర్కొన్న పదార్థాలన్నీ మిక్సీ జార్‌లో వేసి బ్లెండ్ చేయండి. అంతే టేస్టీ.. హెల్తీ.. స్మూతీ రెడీ అవుతుంది.

లెట్యూస్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలోని విటమిన్లు శరీరంలో ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. దీనిలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. దీనిలో విటమిన్ ఏ, కె గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బరువును కంట్రోల్‌లో ఉంచుతాయి. లెట్యూస్‌లోని జీక్సంతిన్, లుటిన్ కళ్ల ఆరోగ్యాన్ని రక్షిస్తాయి, కంటి చూపును మెరుగుపరుస్తాయి. లెట్యూస్‌లోని విటమిన్ కొల్లాజెన్ ఉత్పత్తిలో తోడ్పతాయి (ఎముక నిర్మాణంలో మొదటి దశ). విటమిన్ %ఖ% మృదులాస్థి, బంధన కణజాలాలను నిర్మించడంలో సహాయపడుతుంది. లెట్యూస్‌లోని పదార్థాలు.. మెదడులోని న్యూరానల్ సెల్ మరణాన్ని నియంత్రిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.









పాలకూర కంటి ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందుకు ఈ ఆకుకూరలోని 'ఎ', 'సి', 'కె'.. విటమిన్లే కారణం. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా లభించే వాము ఆకులు జీర్ణశక్తిని పెంచడానికి, వాపును తగ్గించడానికి దోహదం. అవిసె గింజల్లోని ఒమెగా– 3 ఫ్యాటీ యాసిడ్స్ బ్రెస్ట్‌క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పును తగ్గిస్తాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. సబ్జా గింజల్లో అధికంగా ఉండే ప్రొటీన్, ఫైబర్ పదార్థం బరువు తగ్గడంలో సహకరిస్తాయి. శరీరం కోల్పోయిన తేమను తిరిగి అందించడంలో కొబ్బరి నీళ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అలాగే రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి, మూత్రపిండాల్లో రాళ్లు రాకుండా కొబ్బరి నీళ్లు తోడ్పడతాయి.

# ఈ జ్యూస్ తాగితే.. నొప్పులు తగ్గుతాయ్..!



నోని పండు.. దీనిని వామిట్ ఫ్రూట్ అని కూడా అంటారు. తెలుగులో దీన్ని తొగరు పండు అని పిలుస్తారు. నోని పండు చూడటానికి బంగాళాదుంప ఆకారంలో, పసుపు, లేత ఆకుపచ్చ రంగులో ఉంటుంది. దీని లోపల చిన్నచిన్న గింజలు ఉంటాయి. గతంలో ఈ పండు గురించి చాలామంది తెలియదు. దీని ఔషధ గుణాలు, పోషక విలువలు తెలుసుకున్న తర్వాత.. తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల దీన్ని పండిస్తున్నారు. నోని పండు ఔషధాల గని. ఈ పండులో విటమిన్ సి, బయోటిన్, ఫోలేట్, విటమిన్ ఇ, మొక్కల ఆధారిత ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో కూడిన అర్గానికి యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి.

జీవక్రియ మెరుగుపడుతుంది.. నోని పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది ఫైటో న్యూట్రియెంట్ల స్టోర్ హౌస్, ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి శరీరంలోని వివిధ జీవరసాయన ప్రతిచర్యలకు ఆహారాన్ని శక్తిగా మార్చడం ద్వారా సరైన జీవక్రియను సంరక్షించడంలో సహాయపడతాయి. హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంతోపాటు ఆరోగ్యకరమైన కణాలను ఆక్సీకరణం మరియు దెబ్బతినకుండా కాపాడతాయి. వ్యాయామానికి ముందు.. నోని జ్యూస్ తాగితే శరీరానికి పుష్కలంగా శక్తి అందుతుంది. శక్తి స్థాయిలను పెంచుతుంది, కండర కణాలు అరిగిపోకుండా కాపాడుతుంది.



ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.


కీళ్ల నొప్పులు తగ్గిస్తుంది.. రుమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల్లో కీళ్ల నొప్పులను తగ్గించడానికి నోని జ్యూస్ అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఒకటి నుంచి రెండు గ్లాసుల నోని జ్యూస్ తాగితే.. బంధన కణజాలం వశ్యత మెరుగుపడుతుంది. దీనిలోని యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు.. వాపును తగ్గించి నొప్పి నుంచి ఉపశమనం ఇస్తాయి.



గుండెకు మంచిది.. నోని పండ్లలో.. పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది హైపర్‌టెన్షన్‌ను తగ్గించడానికి, రక్తపోటును కంట్రోల్‌లో ఉంచడానికి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడానికి, శరీరంలోని రక్త నాళాలు, రక్త ప్రసరణను ఆరోగ్యంగా ఉంచడానికి పొటాషియం సహాయపడుతుంది. నోని జ్యూస్‌లోని యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ చెడు కొలెస్ట్రాల్, సి–రియాక్టివ్ ప్రోటీన్ స్థాయిలను తగ్గిస్తాయి. ఇవి రక్తంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. అథెరోస్క్లెరోసిస్, హృదయ సంబంధ వ్యాధులు, ఇతర గుండె సమస్యల ముప్పును తగ్గిస్తాయి.

ఇమ్యూనిటీ పెంచుతుంది.. నోని పండులో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది ఇమ్యూనిటీని మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. విటమిన్ తరచుగా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు అలాగే సీజనల్ ఇన్‌ఫెక్షన్లు, మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్, డిమెన్షియా, ఊపిరితిత్తుల శ్వాసకోశ వైకల్యాలు వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. . నోనిలో కెరోటినాయిడ్ యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి శరరీరం నుంచి ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

ఆరోగ్యకరమైన చర్మం, జుట్టు అందిస్తుంది.. నోని పండులో విటమిన్ సి, బయోటిన్, జింక్, కాపర్, సెలీనియం, ఫైటోన్యూట్రియెంట్స్ వంటి పోషకాలు.. చర్మ ఆకృతిని రియాక్టివేట్ చేస్తాయి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. నోని జ్యూస్‌లో యాంటీఆక్సిడెట్స్, యాంటీమైక్రోబియల్ గుణాలు శరీరాన్ని డిటాక్స్ చేస్తాయి. వృద్ధాప్య ఛాయలను ఆలస్యం చేస్తాయి. ఇవి కొల్లాజెన్ సంశ్లేషణను పెంచుతాయి. మొటిమలు, మచ్చలను నయం చేస్తాయి. చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి.



# భోజనం చేశాక తాగితే షుగర్ కంట్రోల్

నేటి కాలంలో చాలా మంది షుగర్‌తో బాధపడుతున్నారు. ఈ సమస్యని తగ్గించుకోవాలంటే కొన్ని ఆయుర్వేద మార్గాలను ఫాలో అవ్వాల్సిందే. అలాంటి కొన్ని టిప్స్ గురించి తెలుసుకుందాం. బాడీలో చక్కెర, ఇన్సులిన్ పెరిగిపోవడమే డయాబెటిస్ అనే సమస్య. మీరు సరైన డైట్, మెడిసిన్, హెల్దీ డైట్ ఫాలో అయితే, ఈ సమస్యని అదుపులో ఉంచుకోవచ్చు. షుగర్ ఉన్నవారు వారి డైట్‌పై దృష్టి సారించాలి. కొన్ని ఫుడ్స్ మాత్రమే తీసుకోవాలి. డైటీషియన్ ప్రకారం.. షుగర్‌ని కంట్రోల్ చేసేందుకు డైటీషియన్ షీనమ్ మల్హోత్రా కొన్ని టిప్స్‌ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసుకున్నారు. ఈ ఇంటి చిట్కాలని ఫాలో అయితే షుగర్ కంట్రోల్ అవుతుందని ఆమె చెబుతున్నారు. మరి అవేంటో తెలుసుకోండి.

మెంతి నీరు.. షుగర్‌ని కంట్రోల్ చేయడంలో మెంతులు బాగా పనిచేస్తాయి. ఈ నీటిలో







కార్బోహైడ్రేట్స్, చక్కెర శోషణని కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తాయి. చక్కెర స్థాయిలు పెరగకుండా చేస్తాయి. షుగర్ కంట్రోల్ చేయడానికి ఏం చేయాలంటే ముందుగా రాత్రి పడుకునే ముందు ఓ టేబుల్ స్పూన్ మెంతులని గ్లాసు నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో రాయాలి. దీని వల్ల డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది.

గోధుమ పిండి బదులు.. సాధారణంగా షుగర్ ఉన్నవారు సాధారణ పిండితో చేసిన వంటలు తినే బదులు రాగులు, జొన్నలు, కొర్రలు వంటి తృణధాన్యాలతో తయారు చేసిన పిండిని వాడాలి. దీని వల్ల ఫైబర్ అందుతుంది. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది.

యాంటీ డయాబెటిక్ పౌడర్.. అదే విధంగా, ఓ బెస్ట్ పౌడర్ గురించి చెబుతున్నారు డైటీషియన్. అదేంటంటే.. సోంపు, వాము, జీలకర్రలని సమాన పరిమాణంలో తీసుకుని డ్రై రోస్ట్ చేసి పౌడర్‌లా చేయాలి. దీనిని ఏయిర్ టైట్ గాజు కంటెయినర్‌లో స్టోర్ చేసుకోవచ్చు. ఈ పౌడర్‌ని రోజూ భోజనం చేశాక ఓ గ్లాసు గోరువెచ్చని నీటిలో ఓ స్పూన్ పరిమాణంలో కలిపి తాగాలి. ఇలా చేయడం వల్ల చాలా వరకూ షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. వీటిని ఫాలో అయ్యే ముందు.. షుగర్ కంట్రోల్ అయ్యే ముందు ఈ ఆయుర్వేద పదార్థాలను తీసుకునే ముందు మీరు ఓ సారి డాక్టర్‌ని కలవడం చాలా ముఖ్యం. మీరు ఏదైనా ఆహార పదార్థాలను డైట్‌లో చేర్చే ముందు డాక్టర్‌ని సంప్రదించాలి.

# బరువు తగ్గడంతో పాటు మజిల్స్ పెరుగుతాయి..



మగవారు ఎక్కువగా తమ కండరాలని పెంచుకోవాలనుకుంటారు. వారు కచ్చితంగా తినాల్సిన ఫుడ్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకోండి. ఈ ఫుడ్స్ తింటే బరువు తగ్గడంతో పాటు మజిల్స్ పెరుగుతాయి.. మజిల్స్ పెరగాలంటే కేవలం నాన్ వెజ్ మాత్రమే తినాలనే అపోహ చాలా మందికి ఉంటుంది. అలా కాకుండా వెజ్‌లో కూడా కొన్ని ఫుడ్స్ మజిల్స్‌ని పెంచుతాయి. మజిల్స్‌ని పెంచడంలో వర్కౌట్ ఎంత ముఖ్యమో, ఫుడ్ కూడా కీ రోల్ పోషిస్తుంది. అయితే, వెజిటేరియన్స్ ఏ ఫుడ్స్ తింటే మజిల్స్ పెరుగుతాయో తెలుసుకోండి.

నట్స్.. నట్స్‌లో కూడా ప్రోటీన్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, బాదం, వాల్‌నట్స్ శరీరానికి అవసరమైన ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, వర్కౌట్‌కి ముందు రోజూ కొన్ని నట్స్ తింటే కండరాల బలం, పెరుగుదలని మెరుగ్గా చేస్తుంది.



పెరుగు.. డైటలో ఉన్నవారికి పెరుగు కూడా మంచి ఫుడ్. ఇందులో ప్రోటీన్ కూడా ఉంటుంది. రోజూ ఉదయాన్నే పెరుగు తింటే ప్రో బయోటిక్ లక్షణాలు ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. కండరాల పెరుగుదలని పెంచుతాయి. దీంతో కండర ద్రవ్యరాశిని పెంచుతుంది. క్వినోవా.. క్వినోవా తింటే బరువు తగ్గేందుకు హెల్ప్ చేస్తుంది. ఈ ఫుడ్ బాడీ బిల్డర్స్‌కి చాలా మంచిది. క్వినోవాలో ప్రోటీన్, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి 6లు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి, అన్నం బదులు హ్యాపీగా తినొచ్చు. స్నాక్స్‌లా కూడా తినొచ్చు. పనీర్.. పాల ఉత్పత్తుల్లో ఒకటైన పనీర్‌లో ఎక్కువగా ప్రోటీన్స్ ఉంటాయి. ఇందులో చికెన్‌తో సమానమైన ప్రోటీన్ ఉంటుంది. కాబట్టి, కండరాలని పెంచుకోవాలనుకునేవారు వీటిని తింటే కొవ్వుని తగ్గించుకోవచ్చు. కాబట్టి, పనీర్ రెగ్యులర్‌గా తీసుకోవచ్చు. పప్పులు.. పప్పులు, కాయధాన్యాలు, చిక్కుళ్ళు కూడా ప్రోటీన్ సోర్సెస్. కండరాలని పెరుగుదలని పెంచి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. కార్బోహైడ్రేట్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. ఉంటాయి. కాబట్టి, పప్పులు, చిక్కుళ్ళు తినడం మంచిది.



శనగలు.. కండరాల పెరుగుదలని పెంచడంలో శనగలు కీ రోల్ పోషిస్తాయి. ఇందులో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్ కంటెంట్ కండరాలు పెరుగుదలని ప్రోత్సహిస్తాయి. అవసరమైన కేలరీలు, కొవ్వుని బర్న్ చేస్తాయి. వీటిని తిన్న తర్వాత సంతృప్తికరమైన అనుభూతిని అందిస్తుంది. ఎక్కువసేపు ఆకలికాకుండా చేసి కేలరీలని తీసుకోకుండా చేస్తుంది. దీంతో బరువుని తగ్గిస్తుంది.

# ఈ జ్యూస్ తాగితే జుట్టు పొడుగ్గా పెరుగుతుందట..



నేటి కాలంలో జుట్టు సమస్యలు చాలా కామన్ అయిపోయాయి. జుట్టు రాలడం, చిట్లడం ఇలాంటి సమస్యలని దూరం చేసి జుట్టు పొడుగ్గా పెరగాలంటే టిప్స్ పాటించడంతో పాటు హెల్దీ డైట్ కూడా చాలా ముఖ్యం. ఇది ఆరోగ్యాన్ని పెంచడంతో పాటు జుట్టు ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. అలాంటి హెల్దీ డైట్‌లో ఓ డ్రింక్ గురించి తెలుసుకోండి. అదే ఎబిసిజి జ్యూస్. ఆ జ్యూస్ ఏంటి. దీని గురించి పూర్తి వివరాలు ఏంటో తెలుసుకోండి.

ఏబీసీజీ జ్యూస్.. ఏబీసీజీ జ్యూస్‌లో జుట్టు పెరుగుదలని పెంచే గుణాలు ఉన్నాయి. అసలు ఏబీసీజీ జ్యూస్ అంటే.. ఏ అంటే ఆపిల్, బీ అంటే బీట్‌రూట్, సీ అంటే క్యారెట్, జీ అంటే జింజర్.. ఈ నాలుగింటిని కలిపి జ్యూస్‌లా తయారు చేస్తారు. ఈ జ్యూస్‌లో జుట్టుని పెంచే విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి.



ఎలా చేయాలంటే.. ముందుగా ఓ యాపిల్, ఓ బీట్‌రూట్, ఓ క్యారెట్, చిన్న అల్లం ముక్క వీటన్నింటిని బాగా కడిగి పీల్ చేయాలి. తర్వాత చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఈ ముక్కల్ని మిక్సీ జార్‌లో వేసి పేస్టులా రుబ్బాలి. మరీ చిక్కగా ఉంటే నీరు పోసి మిక్సీ పట్టాలి. తర్వాత స్ట్రైనర్ చేయాలి.





నిమ్మరసం.. వడపోసిన జ్యూస్‌లో మీకు ఇష్టం అనుకుంటే నిమ్మరసం కలపాలి. ఇందులో విటమిన్ సి ఎక్కువగా ఉంటే ఇది శిరోజాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కాబట్టి, కలిపి హ్యాపీగా తాగొచ్చు.

ఉసిరి పొడి.. ఈ జ్యూస్‌ని మరింత హెల్దీగా చేయాలంటే ఇందులో కొద్దిగా ఉసిరి పొడిని కలపాలి. ఉసిరిలోని గుణాలు జుట్టు పెరుగుదలని ప్రోత్సహిస్తాయి.

తాగే ముందు.. ఈ జ్యూస్ హెల్దీ అయినప్పటికీ వీటి ప్రయోజనాలు వ్యక్తి నుండి వ్యక్తికి మారుతుంటాయి. కాబట్టి, తాగే ముందు ఎక్స్‌పర్ట్స్ సలహా తీసుకోవడం మంచిది.

# దండకారణ్యం ఖాళీ..!



హైదరాబాద్: ఆపరేషన్ కగార్ విస్తృతమైన నేపథ్యంలో మావోయిస్టుల కేంద్ర స్థానం దండకారణ్యం ఖాళీ అవుతోంది. జనతన సర్కార్ పేరిట అబూజ్‌మడ్‌లో ఒకప్పుడు సమాంతర పాలన నడిపిన మావోయిస్టులు ఇక అక్కడ సురక్షితంగా ఉండలేమంటూ దూరంగా వెళ్లిపోతున్నారు. అగ్రనేతలే ఎన్‌కౌంటర్ల బారిన పడుతుండటం.. లొంగుబాటలో పయనిస్తుండటంతో మిగిలిన క్యాడర్ దిక్కుతోచని స్థితిలో తమ ఆయువుపట్టును వదిలి అర్బన్ బాట పడుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ, ఏలూరు, కాకినాడల్లో పోలీసులకు చిక్కిన 50 మంది మావోయిస్టులు ఆ కోవలోనే పట్టణాలకు తరలి ఉంటారనే వాదన వినిపిస్తోంది.

**అన్నిచోట్లా నిర్బంధంతో అక్కడికే..**

వాస్తవానికి భారతదేశ అంతర్గత శత్రువుగా ముద్రపడిన మావోయిస్టు పార్టీ మూడు దశాబ్దాల క్రితమే అబూజ్‌మడ్‌ను తమ కంచుకోటగా మలుచుకుంది. ప్రభుత్వవర్గాలు అడుగుపెట్టని ఆ ప్రాంతంలో జనతన సర్కార్‌ను నడిపింది. 1980 దశకంలోనే అప్పటి పీపుల్స్‌వార్ గ్రూప్(పీడబ్ల్యూజీ) కార్యదర్శి కొండపల్లి సీతారామయ్య(కేఎస్) పార్టీ కీలకనేతల్ని దండకారణ్యం బాట పట్టించారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర కమిటీతోపాటు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కమిటీలుండేవి. ఆయా ప్రాంతాల్లోని అడవుల్లో పార్టీ క్యాడర్ క్రియాశీలంగా వ్యవహరించేది. ఒకవేళ ఆంధ్రప్రదేశ్‌లో నిర్బంధం పెరిగితే మహారాష్ట్రలోని గడ్చిరోలితోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యమే తమకు సురక్షిత స్థానమవుతుందని ఆనాడే కేఎస్ గ్రహించారు. అందుకే తొలుత గడ్చిరోలిలోకి.. ఆపై దండకారణ్యంలోకి దళాలను పంపించారు. కేఎస్ ఊహించినట్లుగానే శాంతిచర్చల అనంతరం 2007 ప్రాంతంలో నల్లమలను పోలీసులు జల్లెడ పట్టడంతో క్రమేపీ ఉమ్మడి రాష్ట్రంలో పట్టు కోల్పోయింది. అప్పట్లో రాష్ట్ర కార్యదర్శి బుర్ర మాధవ్ ఎలియాస్ చిన్నన్నను నల్లమలలోనే గ్రేహౌండ్స్ బలగాలు ఎన్‌కౌంటర్‌లో హతమార్చడంతో మావోయిస్టు దళాలన్నీ దండకారణ్యానికే తరలిపోయాయి. 2021 నవంబరులో గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్(ఎంఎంసీ) జోన్‌ను పర్యవేక్షిస్తున్న కేంద్ర కమిటీ సభ్యుడు మిలింద్ తేల్‌తుమ్డేతో సహా 26 మంది మావోయిస్టులు మృతిచెందడటంతో దండకారణ్యమే ఆఖరి గమ్యస్థానంగా మారింది.

**మావోయిస్టుల గతిని మార్చిన ఆపరేషన్ కగార్**

దండకారణ్యంలో మావోయిస్టులను ఏరివేసే లక్ష్యంతో 2010 దశకం తొలినాళ్లలోనే ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభమైంది. అనంతరం ఆపరేషన్ ప్రహార్ సాగింది. అయితే ఆ రెండు ఆపరేషన్లను మావోయిస్టు పార్టీ ఎదుర్కొని నిలిచింది. అలాగే మావోయిస్టులను

అంతమొందించే లక్ష్యంతో కాంగ్రెస్ నేత మహేంద్రకర్మ నేతృత్వంలో ఏర్పాటైన ప్రైవేట్ సైన్యం 'సల్వాజుడుం'నూ సమర్థంగా తిప్పికొట్టింది.

అయితే గతేడాది ప్రారంభమైన ఆపరేషన్ కగార్(అంతం) మాత్రం మావోయిస్టు పార్టీ గతిని మార్చింది. ఈ ఏడాదే మావోయిస్టు పార్టీని కోలుకోలేని దెబ్బతీసింది.

680 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయగా.. 1,225 మంది లొంగిపోయారు. ఏకంగా 270 మంది ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, బాలకృష్ణ, గణేశ్, వికల్ప్, కోసా సహా ఏకంగా ప్రధాన కార్యదర్శి బస్వరాజ్‌ను సైతం పార్టీ కోల్పోయింది. మరోవైపు సోను, రూపేశ్, చంద్రన్నలాంటి అగ్రనేతలు లొంగిపోయారు. తాజాగా దాడుల వ్యూహకర్త హిడ్మా ఎన్‌కౌంటర్ కావడం.. మిగిలిన పలువురు అగ్రనేతలు లొంగిపోయే ప్రయత్నాల్లో ఉండటంతో దండకారణ్యంలో మిగిలిన క్యాడర్ తలో దిక్కుకు తరలిపోతోంది. కొందరు ఏవోబీ వైపు.. మరికొందరు కర్రెగుట్టల మీదుగా.. ఇంకొందరు ఎంఎంసీ జోన్‌లోని బాలాఘాట్ వైపు వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది.


# అల్పపీడనంతో తెలంగాణకు వర్ష సూచన



ఎస్సీలలో క్రిమీలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీయ పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పుడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్దిని పొందుతున్నారు. దీంతో గత 75 ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీయ లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నాయి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూచించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమీలేయర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయినా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వం గా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, తెగల వారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశిరచిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరినవారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమీలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమీలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పుడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఓకుటుంబం తరాలుగా రిజర్వేషన్లను అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు. పన్న శ్రేణి అంటే క్రీమీలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ కావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించినట్లుగానే క్రిమీలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు.

ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు.

ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేకపోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సిందు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుస్తూ రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని, ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదని అన్నారు. ఇది వాస్తవం. నిజానికి రిజర్వేషన్ల నిచ్చెనలు ఎక్కిన ఎందరో మిగతా ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న దాఖలాలు లేవు. అందువల్ల క్రీమిలేయర్ విధానం అమలు జరగాలి. ఒక కుటుంబానికి ఒకటి రెండుసార్లే రిజర్వేషన్లు అమలు కావాలి. అప్పుడే ఎస్సీలు సామాజికంగా ఎదుగగలరు.




# తెలంగాణలో ఏపీకే ఫైల్స్ అలజడి!..

## వందల వాట్సప్ గ్రూపులపై దాడి

హైదరాబాద్: రాష్ట్రంలో ఏపీకే ఫైల్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు అలజడి సృష్టిస్తున్నారు. 'ఆధార్‌తోపాటు ఇతర నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాలు అప్‌డేట్ చేసుకోని కారణంగా ఈరోజు రాత్రి నుంచి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ చేస్తున్నాం. వెంటనే కింద ఉన్న లింకును క్లిక్ చేసి వివరాలు అప్‌లోడ్ చేయండి' అని టీం ఎస్బీఐ పేరుతో ఆదివారం అనేక వాట్సప్ గ్రూపుల్లో సందేశాలు హోరెత్తాయి. ఎస్బీఐ ఖాతాలున్న చాలామంది బ్లాక్ అవుతుందన్న భయంతో లింకుపై క్లిక్ చేశారు. ఆ క్షణం నుంచే వారి ఫోన్లు నేరగాళ్ల అధీనంలోకి వెళ్లాయి. ఆ వెంటనే సదరు ఫోన్లో ఉన్న ఇతర వాట్సప్ గ్రూపుల్లోకి ఈ సందేశాన్ని పంపారు. ఇలా గొలుసుకట్టుగా వేలాది ఫోన్లకు వెళ్లాయి. ఇందులో రాష్ట్ర మంత్రిత్వశాఖల అధికారులు, మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసుకున్న గ్రూపులతోపాటు స్నేహితులు, విద్యార్థుల గ్రూపులు కూడా ఉన్నాయి. ఫోన్లలోని సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరడంతో అనేకమంది భయాందోళనకు గురవుతున్నారు. పలువురు స్థానిక పోలీసులతోపాటు 1930కి కూడా ఫిర్యాదు చేస్తున్నారు. తక్షణం చేయాల్సిన చర్యలుపొరపాటుగా ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేసి ఉంటే వెంటనే కొన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి మొదట ఇంటర్‌నెట్ డేటా ఆఫ్ చేసి, సెట్టింగ్స్‌లోని యాప్స్‌లోకి వెళ్లి సదరు ఏపీకే యాప్‌ని అన్‌ఇన్‌స్టాల్ చేయాలి. యాంటీ వైరస్ యాప్‌తో ఫోన్‌ని ఫుల్‌స్కాన్ చేయాలి. బ్యాంకింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల ఎకౌంట్లు, ఈ-మెయిల్ ఎకౌంట్ పాస్‌వర్డులు వెంటనే మార్చాలి. మెసేజ్‌లు, కాల్‌లాగ్, బ్యాంకు లావాదేవీలు, ఈ-మెయిల్ లాగిన్లలో అనుమానాస్పద యాక్టివిటీ ఉందేమో పరిశీలించాలి. ఒకవేళ మాల్‌వేర్ యాప్ అన్‌ఇన్‌స్టాల్ అవ్వకపోతే, ఫోన్‌ని సేఫ్ మోడ్‌లో రీస్టార్ట్ చేసి అన్‌ఇన్‌స్టాల్ చేయాలి.ఫోన్లో ఇంకా అనుమానాస్పద యాక్టివిటీ కనిపిస్తే డేటా బ్యాకప్ తీసుకొని ఫ్యాక్టరీ రీసెట్ చేయడం మంచిది.

ఏదైనా మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే బ్యాంకు ఖాతా స్తంభింపజేయాలి. 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.



# టిమ్స్ ఆసుపత్రులు ఎప్పుడు పూర్తి చేస్తారు?: హరీశ్‌రావు

హైదరాబాద్: నెల రోజుల్లో టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రిని ప్రారంభిస్తామని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా సీఎం ప్రకటించి నెల దాటినా ఇప్పటికీ అతీగతీ లేదని, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాల పట్ల ప్రచార ఆర్భాటాలు తప్ప పురోగతి కనిపించడం లేదని భారత రాష్ట్ర సమితి మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులను ఎప్పుడు ప్రారంభిస్తారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. "ప్రభుత్వ భూములను అమ్ముకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్యసేవలు అందించడంపై లేదు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే గానీ, ఆచరణ గడప దాడడం లేదనడానికి టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణమే నిదర్శనం. భారత రాష్ట్ర సమితి హయాంలో శరవేగంగా జరిగిన టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు.. కాంగ్రెస్ రాగానే నత్తనడకన సాగుతున్నాయి. ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయితే ఎక్కడ కేసీఆర్‌కు పేరొస్తుందో అనే ఆలోచనలతో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే వాటి పనులను పూర్తి చేయడం లేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.



# తిరుచానూరులో అంగరంగ వైభవంగా రథోత్సవం

## రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

తిరుపతి:తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం రథోత్సవం ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలు మంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు. అనంతరం అమ్మవారికి రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి. వీర బ్రహ్మం, సివిఎస్వో కే.వి. మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసా చార్యులు, అర్చకులు పాల్గొన్నారు.





# సినిమాలో ఎఐ ట్రెండ్



మహ్మదన్ రఫీతో సోనూ నిగమ్ పాట కృత్రిమ మేధ ఏఐ సంగీత రంగంలోనూ సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తోంది. ఏఐతో ఇప్పటి వరకూ దివంగత గాయకుల గొంతులను సినిమాల్లో వినిపించారు సంగీత దర్శకులు. ఇప్పుడీ ట్రెండ్‌ను గాయకుడు సోనూ నిగమ్ లైవ్ కాన్సర్ట్‌లోకి తెచ్చారు. లైవ్‌లో ఏఐ వినియోగించి దివంగత గాయకుడు మహమ్మద్ రఫీతో కలిసి డ్యుయెట్ పాడి ఔరా అనిపించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోనూ నిగమ్ కాన్సర్ట్ ఏర్పాటు చేశారు. అందులో రఫీకి సోనూ నిగమ్ అద్భుతమైన నివాళులర్పించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రఫీతో గొంతుకలిపారు. స్క్రీన్‌పై రఫీ వీడియో, ఆయన గొంతు వినిపించడంతో అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఇది మరపురాని అనుభూతి' అని అభిమానులు పేర్కొనగా, 'ఏఐని సరిగ్గా ఉపయోగించారు.

ఇది కొత్త ట్రెండ్' అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు. 1924 డిసెంబరు 24న జన్మించిన ఆయన ఎన్నో భాషల్లో వేల పాటలు పాడి రికార్డులు సృష్టించారు. ఆయన బయోపిక్ తీసేందుకు బాలీవుడ్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక సోనూ నిగమ్ హిందీతో పాటు దక్షిణాది చిత్రాల్లోనూ సూపర్ హిట్ సాంగ్స్‌తో అలరిస్తున్నారు.

# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్

## ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి






ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి.

ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# మహిళలు బలహీనులు కాదు..బలవంతులు



నటి రష్మిక మందన్నా కామెంట్స్

ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పింది.

# ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు...





ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్స్ట్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. పౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది.




# ఆస్కార్ ఎంట్రీ పొందిన హోమ్‌బౌండ్

ఆస్కార్ 2026' కు భారత్ తరపున అధికారిక ఎంట్రీ పొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో సెలెక్ట్ అయిన ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్ , విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ప్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతోంది. 23 చిత్రాలను వెనక్కినెట్టి అకాడమీ అవార్డుకు ఎంట్రీ పొందిన 'హోమ్‌బౌండ్'లో ఏముందన్నది చర్చిస్తున్నారు. అది ఉత్తరాదిలోని ఓ గ్రామం. చందన్ కుమార్ (విశాల్ జెత్వా), మహ్మద్ షోయబ్ (ఇషాన్ ఖట్టర్) మంచి స్నేహితులు. వేర్వేరు సామాజిక వర్గాలు, మతాలకు చెందిన వారు సమాజంలో అవమానాలకు గురవుతుంటారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తమకంటూ గుర్తింపు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెడతారు. పోలీసు కావడమే ఇద్దరి లక్ష్యం. అలా కానిస్టేబుల్ పరీక్ష రాసినా.. ఫలితాల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో షోయబ్ ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరతాడు. చందన్ డిగ్రీ చదివేందుకు.. తాను ఇష్టపడిన సుధా భారతి (జాన్వీ కపూర్) చదివే కాలేజీలో జాయిన్ అవుతాడు. ఆ తర్వాత ఊహించని రీతిలో చందన్, షోయబ్ మధ్య మనస్పర్థలొస్తాయి. దానికి కారణమేంటన్నదే కథ. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. స్నేహం, వివక్ష, ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే పోటీ, కొవిడ్ కష్టాలు.. ఇలా పలు పార్శ్వాలతో కూడిన ఈ కథను ఎవరే కోణంలో చూస్తే అదే ప్రధానాంశంగా అనిపిస్తుంది. నెమ్మదిగా సాగినా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. స్నేహితులైన చందన్, షోయబ్‌ల లక్ష్యమేంటన్నది ప్రారంభంలోనే అర్థమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే తీవ్ర పోటీ, పరీక్ష రాసినా ఫలితం తేలకపోతే అభ్యర్థులు పడే మనోవేదన, ఒకవేళ పరీక్షలన్నింటిలో పాస్ అయినా పోస్టింగ్ ఆలస్యం కావడం, చివరకు సర్కారు కొలువుపై ఆశలు వదులుకుని ఏదో ఒక పనిలో చేరడం.. ఇలా మన చుట్టూ జరిగిన, జరుగుతున్న వాటిని కళ్లకు కడుతూ కథలోకి లీనమయ్యేలా చేశారు దర్శకుడు. చందన్ పాత్ర కోణంలో కుల వివక్ష, షోయబ్ పాత్ర వైపు నుంచి మతపరమైన ఇబ్బందులే ప్రధానాంశాలు. స్నేహితుల మధ్య గొడవ జరిగినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా సాగుతుంది.

# మోహన రాగ మ్యూజిక్ లాంచ్ చేసిన మంచుమనోజ్



టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. ఈసారి సినీ సెట్‌లో కాదు? సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ మ్యూజిక్' శనివారం అధికారికంగా లాంచ్ అయింది. చాలా ఏళ్లుగా తన మనసులో దాగి ఉన్న ఈ కల నేడు నెరవేరిందని మనోజ్ భావోద్వేగంగా వెల్లడించారు. ట్విటర్‌లో 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో ఓ సరికొత్త సంగీత సంస్థను ప్రారంభించబోతున్నట్టు చెప్పుకొచ్చారు మంచు మనోజ్. మ్యూజిక్ అంటే తనకు ఎంతో ఇష్టమని? ఈ సంస్థ ద్వారా న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు చెప్పుకొచ్చాడు. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. సంగీతం ఎల్లప్పుడూ నా ఎస్కేప్. నా ఎక్స్‌ప్రెషన్, నా నిజం. ఈ రోజు ఆ జర్నీ డెవలప్ అవుతోంది. నా కొత్త ప్రపంచ మ్యూజిక్ వెంచర్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. మోహన రాగ మ్యూజిక్? యంగ్ టాలెంట్, కరేజ్, నిర్భయమైన సృజనాత్మక కోసం నిర్మించాం అని మంచు మనోజ్ స్పష్టం చేశాడు. నటుడిగా ఎన్నో సినిమాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ సంపాదించిన మనోజ్, సంగీతంపై కూడా మంచి పట్టు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. పోటుగాడు సినిమాలో 'ప్యార్ మే పడిపోయా' పాటను స్వయంగా పాడారు. కరోనా సమయంలో విడుదల చేసిన 'అంతా బాగుంటాంద్రా' పాటకు విపరీతమైన స్పందన వచ్చింది అంతేకాదు పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు లిరిక్స్ కూడా రాశారు. అతని స్వరంలో ఉండే సహజమైన ఎమోషన్,

సంగీతాన్ని వ్యక్తీకరించే తీరు ప్రత్యేకమని ఆయన అభిమానులు అప్పుడప్పుడూ

చెబుతుంటారు. మనోజ్ తండ్రి డాక్టర్ మంచు మోహన్ బాబు, అన్న మంచు విష్ణు, అక్క లక్ష్మీ మంచు సినిమాలకు సంగీతం,

యాక్షన్ విభాగాల్లో కూడా పనిచేసిన విషయాన్ని మనోజ్ గుర్తుచేశారు. మోహన రాగ అనే పేరుకు తనకూ, తన కుటుంబానికీ ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,